ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర





వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 సంచిక : 11 జూలై 2023

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2

సద్గురువు ........................................................ 25

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం

ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యం

ఏకం నిత్యం విమలం అచలం సర్వధీసాక్షిభూతం

భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి।

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 29 మార్చి 1989, కంచుమర్రు

ప్రియమైన ఆత్మబంధువులారా!

సర్వసాధారణంగా డబ్బు ఉన్న చోట చదువు ఉండదు. చదువు ఉన్న చోట డబ్బు ఉండదు. అయితే కొన్ని చోట్ల డబ్బు ఉంటుంది. చదువు ఉంటుంది. రెండూ ఉంటాయి. ఇవి మంచివే. డబ్బు ఒక శక్తి, దానిని లక్ష్మి అన్నారు. చదువు ఒక శక్తి దానిని సరస్వతి అన్నారు. ఇప్పుడు చూడండి డబ్బు ఉన్న వాళ్ళు అందరిని గౌరవిస్తున్నారు, చదువు ఉన్న వాళ్లను కూడా గౌరవిస్తారు, ఆదరిస్తారు. అయితే డబ్బు ప్రసాదించే శక్తి, చదువు ప్రసాదించే శక్తి ప్రకృతికి సంబంధించింది. దీనికి ఆత్మకి ఏమి సంబంధం లేదు. ఇది కూడా మాయలో భాగమే. మన శరీరం చనిపోవటం, మళ్ళీ ఇంకో తల్లి గర్భంలో మళ్ళీ జన్మించటం. మరణించటం, జన్మించటం, ఈ పంచ భూతాలు అన్నీ ప్రకృతే. ఎవడైతే ఈ ప్రకృతిని దాటి వెళ్తున్నాడో వాడికి మాత్రమే నిజం తెలుస్తుంది. మాయ కంచుమర్రులో ఉంది, భీమవరంలో ఉంది అనుకోకండి. మాయ అంతా మనసులోనే ఉంది. అందుచేత మనం ఆత్మను తెలుసుకోవడానికి ప్రయత్నం చేయటం లేదు. ఆత్మను తెలుసుకోవడానికి ప్రయత్నం చేయలేకపోవడమే మాయ. అంటే మనం అందరం ఎక్కడ ఉన్నాం? మాయలోనే ఉన్నాం. కబుర్లు చూస్తే పెద్ద కబుర్లు చెబుతున్నాం. కాని అందరం కూడా ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నాం. అంతా మాయలోనే ఉన్నాం. మా మనస్సు బాగోలేదు, మా మనస్సు కుదురుపడాలి, మా మనసు శాంతిగా ఉండాలి అని అందరూ అడుగుతున్నారు. ఎవరు అడిగినా ఇదే ప్రశ్న. ధనం ఉన్నవాళ్లకు మనసు శాంతి ఉండటం లేదు. ధనం లేనివారికి మనసు శాంతి లేదు. చదువు ఉన్న వారికి మనసు శాంతి లేదు. చదువు లేని వారికి మనసు శాంతి లేదు. పండితులకి శాంతి లేదు, పామరులకి శాంతి లేదు. గౌరవం ఉన్నవాడికి శాంతి లేదు, గౌరవం లేనివాడికి శాంతి లేదు. ఎవరికైనా శాంతి ఉందా? నేను శాంతిగా ఉన్నాను. సుఖంగా ఉన్నాను అని ఎవరైనా చెప్పగలరా? ఎవరు చెప్పలేరు. డబ్బు లేని వారు అనుకుంటారు డబ్బున్నవారు ఎంత సుఖంగా ఉన్నారో అని వాళ్ళు అనుకుంటారు పాపం. అదే విధంగా అధికారంలో ఉన్న వాళ్లను చూసి అధికారం లేని వాళ్ళు ఏమి అనుకుంటారు అంటే వాళ్ళు ఎంత సుఖపడుతున్నారో అనిపిస్తుంది. కానీ ఎవరికీ సుఖం లేదు, ఎవరికీ శాంతి లేదు. కొన్ని మాటలు చెబుతాను, రహస్యాలుగా ఉంచుకోండి. మన

బుద్ధికి పక్షపాతం ఉంది. శరీరానికి పక్షవాతం వస్తుంది. బుద్ధికి పక్షపాతం వస్తుంది. మేము రామా అనుకుంటున్నాం, కృష్ణా అనుకుంటున్నాం, పూజలు చేస్తున్నాం, ఎన్ని చేసినా కుదురు లేదు మనసుకి, అని అందరూ అంటారు. ఎందుచేత అంటే ఈ బుద్ధికి, ఈ మనసుకి, ఆత్మ మీద పక్షపాతం. ఎవడి బుద్ధికి సుఖం లేకపోవడానికి కారణం ఏమిటి అంటే దానికి ఆత్మ మీద పక్షపాతం. ఎందుచేత? అది అక్కడ నుంచి వచ్చింది. అది కొమ్మర నుంచి రాలేదు, మంచిలి నుంచి రాలేదు. ఎక్కడ నుంచి వచ్చింది? మన అమ్మ దగ్గర నుంచి, మన నాన్న దగ్గర నుంచి అది రాలేదు. అమ్మ దగ్గర నుంచి శరీరం వచ్చింది కాని బుద్ధి రాలేదు. మీ బుద్ధి ఎక్కడ నుంచి వచ్చింది? హృదయంలోంచి, సాక్షాత్తు పరమేశ్వరుడులోంచి, ఆత్మలోంచి పొడుచుకుంటూ, పొడుచుకుంటూ, బుద్ధి వచ్చి శిరస్సులో మకాం పెట్టుకుంది. అందుచేత ఈ బుద్ధికి ఆత్మను తెలుసుకునే వరకూ, శాంతి లేదు, సుఖం లేదు. అలా అనకండి. మేము అప్పుడప్పుడు సుఖపడుతున్నాం. మాకు శాంతిగా ఉంటుంది అని కొంతమంది అంటూ ఉంటారు. ఈ మధ్య మాకు బాగానే ఉంది. సుఖంగా ఉన్నాం, శాంతిగా ఉన్నాం అని అంటూ ఉంటారు. మరి మీరు పడే సుఖం నిజం అయితే మీరు పడే సంతోషం నిజం అయితే ఎందుకు చెరిగిపోతుంది? ఇరవై నాలుగు గంటలూ నిలబడి ఉంటుందా? నిలబడటం లేదు. ఏమిటంటే అఖండమైన శాంతి, అఖండమైన ఆనందం ఇవన్నీ మన ఆత్మలో ఉన్నాయి. ఆత్మను తెలుసుకొనేవరకు మనకు సుఖం, శాంతి అందదు.

మాకు ఆత్మ తెలియడం లేదు అని మీరు అనుకున్నా లోపల ఆత్మ ఉంది. ఎవడైతే దేవుడు లేడు, దేవుడు లేడు అని చెబుతున్నాడో వాడి హృదయంలో కూడా దేవుడు ఉన్నాడు. కాని మీరు లేరు అని చెబుతున్నారని కోపగించుకుని బయటకి వెళ్లటం లేదు. వాడిని ఎలా దారిలోకి తెచ్చుకోవటం, వాడి మొఖం నా వైపుకి తిప్పకోవటం ఎలాగ? వాడిని బాగు చేయటం ఎలాగ? ఒక్కసారి వాడి ముఖం నావైపు తిప్పితే బాగుండును అని దేవుడు చూస్తున్నాడు కాని, దేవుడు లేడు అనేవాడి హృదయం నుంచి కూడా దేవుడు బయటకి వెళ్లటం లేదు. ఆయన కరుణామయుడు, ప్రేమ స్వరూపుడు. దేవుడు అంటే ఏమిటి? ఆనందం. ఆత్మ అంటే ఏమిటి? ఆనందం. ఆత్మ అంటే ఏమిటి? శాంతి, అది ఎప్పుడూ ఉంటుంది. సముద్రంలో కెరటాలు వచ్చినప్పుడు బయటకి తుంపరలు ఎలా వస్తాయో, అలా నీ బుద్ధి ఆత్మ వైపుకి తిరిగినప్పుడు ఆత్మానందం వచ్చి నీ బుద్ధికి అందుతుంది. ఆ ఆనంద తుంపరలు వచ్చి నీ బుద్ధికి తగులుతాయి. తగిలినప్పుడు ఎంత బాగుందో, ఎంత సంతోషంగా ఉందో, ఎంత

శాంతిగా ఉందో అని మీరు అనుకుంటారు. ఆ శాంతి ఎక్కడ నుంచి వచ్చింది? భగవద్గీతలోంచి రాలేదు, బైబిల్‌లోంచి రాలేదు, వేదంలోంచి రాలేదు, నీ హృదయంలోంచి వచ్చింది. అది మహా సముద్రం కింద కెరటాలు కొడుతూ ఉంటుంది. ఆ ఆనంద సముద్రంలో కలిసే వరకూ, దానిని అనుభవంలోకి తెచ్చుకునే వరకు, అది గ్రహించే వరకు, లోపల ఉన్న వస్తువును పట్టుకునే వరకు మనకు శాంతి లేదు, సుఖం లేదు. ఆ శాంతి ఒక్కసారి మీరు అనుభవించారా? ఆ సుఖం మీకు ఒక్కసారి దొరికిందా అప్పుడు మీరు లోకాతీతమైనటువంటి, ఊహాతీతమైనటువంటి, మరణానికి అతీతమైనటువంటి, మాయకి అతీతమైనటువంటి, ప్రకృతికి అతీతమైనటువంటి ఆనందంలో కెరటాలు కొడతారు. అప్పటి వరకు మనకి అశాంతి తప్పదు. మరణం తప్పదు, జన్మ తప్పదు. ఈ శరీరాలు తప్పవు, ఈ శవాలు మోయటం తప్పదు. సంసారం తప్పదు, కష్టం తప్పదు. నష్టం తప్పదు, బాధ తప్పదు. భారం తప్పదు. ఇక్కడ పరమాత్మ ఏమి చెపుతున్నాడు అంటే ఈ బుద్ధి ఎంతసేపు బయటకి పరుగెడుతుంది. కాని లోపలికి వెళ్ళమంటే వెళ్ళదు. బయటికి అస్తమాను తిరుగుతూ ఉంటుంది. బాహ్య వృత్తుల కోసం, బాహ్య గొడవల కోసం తిరుగుతూ ఉంటుంది. ఈ బుద్ధి ఇంద్రియ సుఖాలు ఎలా ఉన్నాయో చూసింది. ఇంద్రియ భోగాలు ఎలా ఉన్నాయో చూసింది. ఆత్మ సుఖం ఎలా ఉందో ఈ బుద్ధి ఎప్పుడూ చూడలేదు. అందుచేత మనకి ఎంతసేపు ప్రపంచం, ఇంద్రియాలు, గౌరవాలు, ఇష్టాలు, అయిష్టాలు వీటి మీదనే మనకు రోజు అంతా వెళ్ళిపోతుంది. సూర్యోదయం మొదలు, సూర్యుడు అస్తమించే వరకు, గడియారం ముల్లు లాగ, ఇష్టం, అయిష్టం, రాగం, ద్వేషం, కోపం, వాడి మీద చిరాకు, వీడి మీద చిరాకు, ఇలాగే అటు ఇటు తిరుగుతూ ఉంటుంది. ఇటువంటి బుద్ధి వల్ల నీకు ఆత్మ తెలుస్తుందా? తెలియదు. పరమేశ్వరుడు చెబుతున్నాడు ఈ మాటలు, మామూలు మానవుడు కాదు. పరమేశ్వరుడు చెప్పేది అబద్ధం చెప్పడు, నిజం చెబుతాడు. నన్ను శరణు వేడుకొంటే, నా యందు నువ్వు గౌరవ భావం పెంచుకుంటే, అప్పుడు ఇంద్రియాల వైపు పరుగు పెడుతున్న నీ బుద్ధిని, ప్రకృతి వైపుకి పరుగు పెడుతున్న నీ బుద్ధిని, బాహ్య గొడవల వైపు పరుగు పెడుతున్న నీ బుద్ధిని, నెమ్మది నెమ్మదిగా దూడను మళ్లించినట్టు మళ్లించి, ఏ బుద్ధిని నీకు ఇస్తే ఆత్మ తెలుస్తుందో అటువంటి బుద్ధిని నీకు ఇస్తాను. అప్పుడు ఆ బుద్ధి తోటి నీకు ఆత్మ తెలియబడుతుంది అని పరమేశ్వరుడు ఎవరికి చెబుతున్నాడు? అర్జునుడికి చెబుతున్నాడు. ఈ మధ్యన నాలుగు రోజుల నుంచి చాలా బాగుంది అంటారు పాపం, నాలుగు రోజుల నుంచి బాగుంది అంటే temporaryగా బాగుంది. ఐదో రోజున సుఖం పోతుంది,

శాంతి పోతుంది. మనకి శాశ్వతంగా ఎప్పుడూ చెరగకుండా సుఖం, శాంతి ఉండాలి అంటే, ఆత్మను దర్శించాలి. అయితే మనకి అప్పుడప్పుడు ఆత్మ సుఖం అందినప్పటికీ, అది temporary, ఒక రోజో, రెండు రోజులో ఉంటుంది. తరువాత చెరిగిపోతుంది. మన బుద్ధి ఆత్మాకారం చెందే వరకు, ఆత్మ చేతన పొందే వరకు, permanent సుఖం మటుకు రాదు, permanent శాంతి మటుకు రాదు. మోక్షం కూడా రాదు. మనం ఎలా ఉండాలి అంటే ఎవరి ఇంటికి అయినా చుట్టాల ఇంటికి వెళ్లాం అనుకోండి, ఆ రోజు చాలా జాగ్రత్తగా ఉంటాం. మర్యాదగా మాట్లాడుతాం. అంత జాగ్రత్తగా మనం చనిపోయే వరకు ఉంటే మనకు జ్ఞానం వస్తుంది.

మన బంధువుల ఇంటికి వెళ్లినపుడు ఎంత జాగ్రత్తగా ఉంటామో, మనం ఇంటివద్ద ఉన్నపుడు కూడా మన ప్రవర్తనలో, మన మాటలో, మన తీరులో, అంత జాగ్రత్తగా కనుక ఉంటే అప్పడు కదా జ్ఞానం వచ్చి వరిస్తుంది. ఇప్పడు అందరం కంచుమర్రులో ఉన్నాం. చనిపోయిన తరువాత ఎక్కడికి వెళ్లిపోతామో, మళ్లీ ఎప్పడు వస్తామో ఈ భూమి మీదకి, అయితే తీరా ఇపుడు వచ్చాము కదా, అందుచేత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. ఉపయోగించుకుంటే భగవంతుడు ఏమి చేస్తాడు అంటే జన్మ ఇచ్చాను నేను, ఎంత బాగా ఉపయోగించుకున్నాడు అని వచ్చే జన్మలో చాలా మంచి జన్మ ఇచ్చి, మంచి వాతావరణంలో మనలని పుట్టేలా చేస్తాడు. ఎన్నో జన్మల సుకృతం చేసుకుంటే, మంచి ఆశయం కల, అంటే మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావటానికి అవకాశాలు ఉన్న కుటుంబాలు దొరుకుతాయి. అటువంటి అవకాశం అందరికి దొరకదు. నువ్వేదో ప్రయత్నం చేస్తూ ఉంటే, నీకు చేతనైన కృషి నువ్వు కనుక చేస్తూ ఉంటే, భగవంతుడు ఏమి చేస్తాడు అంటే నీ మరణానంతరం నిన్ను తీసుకెళ్లి ఎటువంటి కుటుంబంలో నీకు జన్మ ఇవ్వాలో, అటువంటి కుటుంబంలో ఈ జీవున్ని తీసుకెళ్లి ఆ తల్లి గర్భంలో నిన్ను ప్రవేశ పెడతాడు. అందుచేత చావు అంటే మీరు ఎవరు భయపడకండి. చావు అంటే ఏమిటి? రోజు మనం నాలుగు గంటలో, ఐదు గంటలో, రాత్రుళ్లు నిద్ర పోతున్నాం. చనిపోయినప్పడు మూడు సంవత్సరాలో, నాలుగు సంవత్సరాలో నిద్ర పోతాం, ఆ నిద్ర చాలా బాగుంటుంది. నిద్రలో చాలా బాగుంటుంది

**మన అహంకారాన్ని మనం పోగొట్టుకోలేము. మనకు గురువు అనుగ్రహము ఉంటే మన అహంకారము మనకు తెలియకుండానే జారిపోతుంది. దాన్ని మన తెలివితేటల వల్ల పోగొట్టుకోలేము.**



కాబట్టే మనం అందరం నిద్ర కోరుకుంటున్నాం. నిద్ర రాకపోతే డాక్టరు గారి దగ్గరకు వెళ్లి మందులు అడుగుతున్నాం. నిద్రలో కనుక శాంతి లేకపోతే నిద్రలో సుఖం నీకు లేకపోతే నిద్రను ఎందుకు కోరుకుంటున్నావు. రైలులో నిద్ర చెడిపోతుంది ఏమో అని బెర్తులు కేటాయించుకుంటున్నాం. నిద్రలో కనుక శాంతి లేకపోతే నిద్రలో సుఖం లేకపోతే మనం రాత్రుళ్లు నిద్రపోవాలి అని కోరుకుంటామా? చావు అంటే మీరు భయపడకండి, నిద్రలో ఉన్నట్టే ఉంటుంది. అందరికి ఏమి కావాలి? శాంతి కావాలి. అహింసా ప్రవృత్తి ఉన్నవాడికి శాంతి వస్తుంది. హింసా ప్రవృత్తి ఉన్నవాడికి శాంతి రాదు. ఎవరికి శాంతి వస్తుంది? ఎవడైతే మోక్షం పొందాడో వాడికి శాంతి వస్తుంది. రాగ ద్వేషాలు ఉన్నవాడికి మోక్షం వస్తుందా? మోక్షం రాదు. మన గుండెలో ఎంత కాలం రాగ ద్వేషాలు, కామ క్రోధాలు గూడు కట్టుకుని ఉన్నాయో, అంతకాలం శాంతి లేదు. అంతకాలం మోక్షం లేదు. అంతకాలం మనస్సు అణగదు, ఆగదు. మీకు డబ్బు ఉండవచ్చు, చదువు ఉండవచ్చు. మీకు గౌరవం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు. కాని మీ మనస్సు అణగదు. అగ్గి పుల్లలు పెట్టి పొయ్యి వెలిగించుకోవచ్చు కాని రాగ ద్వేషాలను కాల్చలేము. అందుకే ధ్యానం అనే అగ్ని, జపం అనే అగ్ని అవసరం. భగవంతుని స్మరించగా స్మరించగా, ధ్యానం చేయగా చేయగా, జపం చేయగా చేయగా, తపస్సు చేయగా చేయగా, మీ హృదయం నుండి ఒక అగ్ని పుట్టి మీ రాగ ద్వేషాలను కాల్చి బూడిద చేస్తుంది. మీరు మోక్షం పొందటానికి ఏవైతే అడ్డు వస్తున్నాయో, మీరు తపస్సు చేస్తే, సాధన చేస్తే దాని వలన అగ్ని పుట్టి మీలో ఉన్న విషయాలను కాల్చి బూడిద చేస్తుంది. సోదరమహాశయులారా! మన హృదయంలో నేను నేను అనే స్ఫురణ ఉంది కదా అది అందరిలోనూ సమానంగా ఉంది. జంతువులకి కూడా నేను స్ఫురణ ఉంది కాని నేను అని పాపం నోటితోటి చెప్పలేవు. ఈ నేను అనే స్ఫురణ ప్రపంచంలో అన్ని దేశాలలో ఉన్న జీవరాశులకీ ఉంది. నేను నేను అనే స్ఫురణ లేని జీవిని మీరు చూశారా? తెలివైన వాడికి, మొద్దు వాడికి కూడా నేను నేను అనే స్ఫురణ వాడికి కూడా ఉంది. నేను స్ఫురణ లేనివాడు ఎవడు లేడు. ఈ నేను స్ఫురణ ఎక్కడ నుంచి వచ్చింది? దేని దగ్గర నుంచి ఆ స్ఫురణ వచ్చింది? మీలో, నాలో, దేవతల్లో, క్రిమి కీటకాలలో, లోపల ఉన్న వస్తువు ఒక్కటే. ఈ సద్వస్తువు లోంచే ఈ నేను నేను అనే స్ఫురణ వచ్చింది. ఈ నేను నేను అంటే ఏమిటి? అదే మనస్సు. అందుచేత మనసు అణిగితే అది అణిగిపోతుంది. మనస్సు అణగాలి. మనసు అణగటానికే పూజ, మనసు అణగటానికే జపం, మనసు అణగటానికే

ధ్యానం. సత్య వస్తువు మనలోనే ఉంది. అది అణువు కంటే ఇంకా చిన్నది. అది సూక్ష్మాతి సూక్ష్మం. మన మనస్సు కూడా అంత సూక్ష్మాతి సూక్ష్మం అయినప్పడు అక్కడ అది లయం అవుతుంది. దేవుడు మనలని విడిచి పెట్టి ఎక్కడికో వెళ్ళిపోయాడు అనుకోకండి. మన హృదయంలో ఉన్నాడు. అంతర్యామిగా ఉన్నాడు. జీవులను కర్మానుసారం నడిపిస్తున్నాడు. అందుచేత మనలని విడిచి పెట్టి సృష్టిని విడిచి పెట్టి దేవుడు ఎక్కడికో వెళ్ళిపోయాడు అని మీరు అనుకోవద్దు. అందరి హృదయాలలోనూ అంతర్యామిగా ఉన్నాడు. అటువంటి పరమేశ్వరుడి పట్ల మీకు కనుక ప్రేమ కుదిరితే, భక్తి కుదిరితే, అభిరుచి కుదిరితే, ఈ జన్మలోనే, ఈ దేహంలో ఉండగానే, ఆ వస్తువు మీకు లభ్యం అవుతుంది. పుస్తకాలు చదివితే జ్ఞానం రాదు. మీరు పూజలు చేస్తే రాదు. ఏది జ్ఞానం? ఆత్మే జ్ఞానం. శివుడికి జ్ఞాన నేత్రం ఉందంటారు. జ్ఞాన నేత్రం అంటే జ్ఞానం వేరు, నేత్రం వేరు కాదు. జ్ఞానమే నేత్రం. మీకు జ్ఞానం వచ్చేసింది అనుకోండి మీకు జ్ఞాన నేత్రం ఉన్నట్టే. మనకి నేత్రాలు ఉన్నాయి కాని ఈ నేత్రాలు మాంసం తోటి తయారు అయ్యాయి. జ్ఞానంతో తయారు చేసిన నేత్రాలు కాదు. ఎవరి కళ్ళలో అయినా ప్రేమ కాని, శాంతి కాని, దయ కాని, ఆప్యాయత కాని, ఎక్కడైనా కనిపిస్తున్నాయా? ద్వేషాలు, కక్షలే కనబడుతున్నాయి. మీ హృదయంలో లేనిది మీ కళ్ళలోకి రాదు. మీ లోపల ఉన్నదే కళ్ళలో కనబడుతుంది. కొంతమంది కళ్ళు చూస్తూ ఉంటే నిప్పలు కక్కుతూ ఉంటాయి, ద్వేషం కక్కుతూ ఉంటాయి. అంటే ఆ హృదయంలో ఎంతో ద్వేషం ఉంది. మీకు తెలివి తేటలు ఉండవచ్చు. నువ్వు సత్యాన్ని తెలుసుకోవడానికి, నిజాన్ని తెలుసుకోవడం కోసం, మోక్షాన్ని పొందటం కోసం నీ తెలివి తేటలు ఉపయోగించుకోకపోతే ఆ తెలివి ఏమి చేసుకుంటావు? కొంపలు తగులబెట్టడానికి తెలివి ఉపయోగించుకుంటావా? కక్షలు పెంచటానికి తెలివి ఉపయోగించుకుంటావా? అశాంతి పెంచుకోవటానికి నీ తెలివి ఉపయోగించుకుంటావా? అనారోగ్యం పెంచుకోవడానికి నీ తెలివి ఉపయోగించు కుంటావా? లేకపోతే నువ్వు బాగు పడటానికి, జ్ఞానంలో, శాంతిలో, ప్రేమలో ఎదగటానికి నీ తెలివి తేటలు ఉపయోగించుకుంటావా? మంచికా, చెడుకా నీ తెలివి తేటలు నువ్వు ఉపయోగించుకునేది? ఏది మోక్షం? ఏది మోక్షం కాదు? ఏది శాంతి? ఏది అశాంతి? అది నువ్వు విడదీసుకో, కూరగాయలని కత్తిపీట మీద ఎలా కోసుకుంటావో, అలా ఏది నిజం, ఏది అబద్ధం అని నీ బుద్ధి తోటి, నీ తెలివితేటల తోటి విడదీసుకో, అలా విడదీసుకోకపోతే నీ తెలివి వల్ల నీకు ప్రయోజనం ఏమిటి? ఎవరు ఏది చెప్పినా మీరు

నమ్మకండి, నేను చెప్పినా మీరు నమ్మవద్దు. మీకు తెలివి తేటలు ఉన్నాయి. మీ తెలివి తేటల తోటి మీరు ఆలోచించుకోండి. నేను చెప్పేవి ఎంతవరకు నిజం? ఎంత వరకు సబబుగా ఉన్నాయి. మన జీవితంలో ఎంతవరకు ఈ మాటలు ఉపయోగపడతాయి. మనం బాగుపడాలి అని ఈ మాటలు చెబుతున్నారా అని మీ తెలివితో వాటిని జల్లెడ పట్టండి. అంతేగాని ఎవరు ఏది చెపితే అది నమ్మి వాటి కూడా పోవద్దు. ఒక సంపన్నురాలు భగవాన్ దగ్గరకు వచ్చింది, ఈవిడకి మంచి తెలివి తేటలు ఉన్నాయి. అందం ఉంది. డబ్బు ఉంది. అన్నీ ఉన్నాయి. ఆమె భగవాన్‌ని ఏమని అడిగింది అంటే మహారాజ్‌జీ తమరెంతో దయా పరులు అని విన్నాను. ఉత్తమోత్తములు అని కూడా విన్నాను. ఎన్నో సంవత్సరాలు నుండి మిమ్మల్ని చూడాలి అనుకుంటున్నాను. పూర్వం ఒకసారి వచ్చాను కాని ఎక్కువ గంటలు మీ దగ్గర ఉండలేకపోయాను. పరిస్థితులు అనుకూలించలేదు. నేను ఆడదాన్ని కాబట్టి నాకు మీరు సహాయం చెయ్యాలి అని చెప్పింది. ఆ గుండెకి ఎంత దెబ్బ తగిలిందో, ఆ గుండె ఎంత బానిసత్వం భరించిందో మరి. స్వామి నేను అబలను, అనుకున్నపుడల్లా రావడానికి మీ దగ్గరకు కుదరదు. ఇంటి చుట్టూ ఉన్న వాళ్లతో పడలేక పారిపోయాను. అంటే పరిస్థితులు అనుకూలం అంటే ఇది. మీకు పూర్వ జన్మ సుకృతం ఉంటే మీ పొరుగు వారు మీ స్నేహితులు, మీ బంధువుల యొక్క సహకారం అనేక రంగాలలో మీకు ఉంటుంది. ఆధ్యాత్మికంగా కానివ్వండి, ఆర్థికంగా కానివ్వండి, అనేక విషయాలలో సహకారం ఉంటుంది. మనకు పూర్వ జన్మ సుకృతం లేకపోతే అందరూ మనకి వ్యతిరేకంగా ఉన్నట్టే అనిపిస్తుంది. అందుచేత ఎవరు ఏ కుటుంబంలో పుట్టినా, ఆ కుటుంబాన్ని తిట్టుకోకండి. ఆ కుటుంబానికి మనం పనికి వస్తాం కాబట్టి తీసుకొచ్చి ఆ కుటుంబంలో ఈశ్వరుడు పడేశాడు. You only get what you deserve. ఎంతవరకు అయితే మనకు యోగ్యత ఉందో, అంతవరకే మనం ఆ వస్తువును పొందుతాం. మనకి యోగ్యత లేకపోతే వస్తువు వచ్చి నెత్తి మీదపడాలి అంటే రాదు. ఆమె భగవాన్‌తో ఏమి చెపుతోంది అంటే నేను ఆడదాన్ని, వయసులో ఉన్నాను, ఇంటి చుట్టూ ఉన్నవారితో పడలేక పారిపోయాను. ఇతర దేశం నుంచి ఎక్కడ నుంచో వచ్చాను. మా దేశంలో మీలాంటి మహాత్ముడు లేడు. నాకు కావలసినవి అన్నీ ఉన్నాయి. జీవితంలో ఏ లోటూ లేదు కాని, దేని వల్ల శాంతి వస్తుందో, దేని వల్ల సుఖం వస్తుందో అది నాకు లేదు. త్యాగరాజు అన్నాడు శాంతి లేని వాడికి సుఖం ఎక్కడ వస్తుంది? మీకు ఎన్ని భోగాలు ఉన్నా, ఎన్ని భాగ్యాలు ఉన్నా, ఎన్ని గౌరవాలు ఉన్నా, నీ హృదయంలో శాంతి లేకపోతే

నీకు సుఖం ఎక్కడ నుంచి వస్తుంది? శాంతి లేనివాడికి సుఖం ఎక్కడ నుంచి వస్తుంది? ఒక రహస్యం చెబుతున్నాను వినండి. Keep it in your heart. నేను చెప్పే విషయం మీరు నమ్మినా, నమ్మకపోయినా, మీకు ఎలా అర్థం అవుతోంది అని చర్చ పెట్టుకోకండి. మీరు నమ్ముతున్నారా, నమ్మటం లేదా అనే సమస్య కాదు. మీ తెలివి తేటలు ముందు మేత వేస్తున్నాను. మీరు గ్రహించటానికి ప్రయత్నించండి. విడిచి పెట్టేయకండి. మిమ్మల్ని బలవంతం చేయడం అనే సమస్య లేదు. మిమ్మల్ని ఫాలో అవ్వమని చెప్పటం కాని మిమ్మల్ని ఏ దేవుడికో అనుచరులుగా చేయటానికి కాని నేను ఇక్కడకు రాలేదు. మీ శాంతి కంటే మీ సుఖం కంటే దేవుడు ఎక్కువ కాదు. మీరే ముఖ్యం నాకు. మీరు లేని రమణమహర్షిని నేను స్మరించలేక పోతున్నాను. నాకు రమణమహర్షి జ్ఞాపకం వస్తున్నాడు. కాని మీరు లేని రమణమహర్షి మటుకు నాకు గుర్తు రావటం లేదు. నాకు రమణమహర్షి కావాలి కాని మీరు లేని రమణమహర్షి మటుకు నాకు అక్కర్లేదు. ప్రకృతి విషయాలలో ఏ విషయం మీద అయితే మన మనస్సు వేగంగా వెళ్లి వాలుతోందో, అలా ఎంత దూరం వెళ్లిపోయిందో, మళ్ళీ భవిషత్ జన్మలో ఎంతో కష్టపడితేనే కాని నా మనసు వెనక్కు రాదు. ఆత్మలో లయం కాదు. ఇది ఒక్కటే మీరు గుర్తుపెట్టుకోండి. దైనందిన జీవితాలలో మీరు బహు జాగ్రత్తగా ఉండండి. అజాగ్రత్త పనికి రాదు. ఏ విషయాల మీదకి మీ మనసు వేగంగా వెళుతోందో చూసుకోండి. ఆ విషయం నుండి మీ మనసును withdraw చేయకపోతే, ఈ జన్మలో చేయకపోతే వచ్చే జన్మలో చేయాలి. ఆ జన్మలో చేయకపోతే పై జన్మలో చేయాలి. అయితే ఆ విషయాల నుండి withdraw అవ్వకుండా మటుకు మీకు ఆత్మసాక్షాత్కారం అవ్వదు. మీ బుద్ధి ఆత్మ వైపుకి వెళ్లదు. మీ బుద్ధికి శాంతి దొరకదు. సుఖం దొరకదు. నాకేమి లోటు లేదు స్వామి. నాకు ఈ కొరత ఉంది జీవితంలో అని చెప్పటానికి లేదు. భౌతికంగా చూస్తే నాకు ఈ కొరత ఉంది. ఎవరు తీరుస్తారు ఈ కొరత అని చెప్పటానికి వీలు లేదు. అన్నీ ఉన్నాయి. నా తండ్రి కాని, నా భర్త కాని, నాకేమి ఉపకారం చెయ్యనక్కరలేదు అన్ని comforts నాకు ఉన్నాయి. నాకు అన్నీ ఉన్నాయి కాని శాంతి లేదు. అందుచేత నాకు సుఖం కూడా లేదు. శాంతి తమ సమక్షంలో లభించగలదని ఆశ నన్ను ఇక్కడకు లాక్కువచ్చింది. మీ దగ్గరకు వచ్చి మిమ్మల్ని చూస్తే నాకు శాంతి కలుగుతుంది అని, దేశం కాని దేశం ఇంతదూరం వచ్చి మీ దగ్గర పడ్డాను స్వామి అని ఈ సంపన్నురాలు చెప్పింది.

నాకు సుఖం లేదు సుఖం కావాలి అంటే శాంతి ఉండాలి. ఆ శాంతి కోసం నీ

దగ్గరకు వచ్చాను అని రమణస్వామిని అడిగింది. అప్పుడు భగవాన్ అంటున్నారు నీ భక్తి నీ కోరికలు నెరవేరుస్తుంది. నువ్వు భక్తి తోటి ఇక్కడకు వచ్చావు నీ భక్తే నీ కోరిక నెరవేరుస్తుంది. నేను నెరవేరుస్తాను అని చెప్పటం లేదు. నీ భక్తే నీ కోరిక నెరవేరుస్తుంది. భగవాన్ సర్వ సాధారణంగా impersonalగా మాట్లాడుతారు కాని personalగా మాట్లాడరు. తన మీద ఏమి పెట్టుకుని మాట్లాడరు. స్వామి నీ గురించే మేము ఇక్కడకు అరుణాచలం వచ్చాము అని ఎవరైనా భగవాన్‌తో చెబితే, మరి నేను ఎవరి గురించి ఇక్కడకు వచ్చాను? ఆయన మీద ఏమి పెట్టుకోరు చూడండి ఎంత నిరహంకార స్థితో, ఎంత నిరాడంబర స్థితో, ఎంత నిరభిమాన స్థితో మీరు చూడండి. ఎవరైనా చిన్న మాట మన ఇంటిలో అంటే, మన క్షేమం కోరే వాళ్ళే మనలని చిన్న మాట అంటే మనకు ఎంతో దుఃఖం వస్తుంది. కారణం ఏమిటి? దేహాభిమానం. మనకి దేహాభిమానం ఉంది కాబట్టి, మన క్షేమం కోరి ఎవరైనా తిట్టినా కాని మనకు దుఃఖం వస్తుంది. రమణమహర్షి గారు ఏమి చెప్పినా impersonalగా చెప్పారు కాని నేను చెబుతున్నాను నువ్వు విను అనే మాట ఎన్నడూ చెప్పలేదు.

Paul Brunton అని ఇంగ్లీష్‌లో గొప్ప రచయిత, ఆయన రమణమహర్షి గారి దగ్గరకు వచ్చారు. అక్కడ Brunton ఒక మాట అన్నారు. స్వామి నేనే గనుక జ్ఞానిని అయితే మిమ్మల్ని ఎటువంటి ప్రశ్నలు అడుగుతాను? Brunton నేనే గనుక జ్ఞానిని అయితే ఎటువంటి ప్రశ్నలు అడుగుతాను అని నువ్వు అంటున్నావు. నువ్వే కనుక జ్ఞానివి అయితే ప్రశ్నే అడగవు అసలు, ప్రశ్న అడగటానికి ఏముంది? అంతా అద్వైతమే. ద్వైత బుద్ధి ఉంటే నీకు ప్రశ్న, అద్వైత స్థితిలో రెండో వస్తువు లేని స్థితిలో అటువంటి నిరాకారస్థితిలో అద్వైతస్థితిని నువ్వు పొందినప్పుడు నీకు ప్రశ్నే రాదు. దేవుడు ఉన్నాడా లేడా అని కాని, ప్రకృతి గురించి కాని ఏ రకమైన ప్రశ్న నీకు రానే రాదు. ఎప్పుడు? నువ్వు ఆత్మను తెలుసుకున్నప్పుడు. నీకు ఆత్మానందం తెలిసే వరకు ఈ సినిమాలు ఆనందం, ఇంద్రియాలు ఆనందం, ఈ వినోదాలు ఆనందం, ఈ డబ్బు ఆనందం, బాహ్యమైన ఆనందాలకి నీ మనసుని నువ్వు వద్దు అన్నా, నీ బుద్ధిని నువ్వు వద్దు అన్నా తీవ్రమైన వేగంతో పరిగెత్తుకుపోతుంది. ఎప్పటి వరకు?



**సద్గురువు ఎక్కడ ఉన్నాడు అని భగవాన్‌ని అడిగితే 'నీ లోపలే ఉన్నాడు' అని చెప్పారు. సద్గురువు నా లోపలే ఉన్నాడని నాకు ఎలా తెలుస్తుంది, నా కళ్ళకి కనిపించాలి కదా అని అడిగితే 'నీ కళ్ళకి కనిపించే సద్గురువే చెపుతున్నాడు, నీ లోపల సద్గురువు ఉన్నాడని' అన్నారు భగవాన్.**

ఆత్మానందం నువ్వు తెలుసుకునే వరకు. ఇది తప్పదు ఇది తప్పదు ఇది నిత్యం.

ఆత్మానుభవం నీకు రానప్పుడు సినిమాకి అత్తిలి వెళ్లిపోదాం అని లేకపోతే భీమవరం వెళ్లిపోదాం అనుకుంటావు. అలా కాదు ఉపన్యాసాలలో సినిమాలు ఎక్కువ చూడవద్దు అని చెప్పారు అని నువ్వు అనుకొన్నా ఒకరోజు బుధవారం ఆగుతుంది, లక్ష్మివారం ఆగుతుంది. మీలో ఉన్న సంస్కారం మిమ్మల్ని శుక్రవారం తీసుకెళ్ళి సినిమా హాలులో పడేస్తుంది. ఎందుచేత అంటే మీకు నిగ్రహాశక్తి లేకపోవడం. మీకు ఆ వస్తువు లభ్యం కానప్పుడు మీరు నిగ్రహించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నప్పటికీ మీకున్న వాసన, మీకున్న సంస్కారం, మీకున్న అభిరుచి బలవంతంగా మనసును ఆత్మ నుండి బయటకు లాగి బహిర్ముఖం చేస్తుంది. నిగ్రహ శక్తి ఉండాలి అని భగవంతుడు వాసుదేవ స్వామి భగవద్గీతలో చెప్పాడు. భగవంతుడు కృష్ణుడు అంతటి వాడు ఓ అర్జునా నిగ్రహః కిం కరిష్యతి ఆ వస్తువు మీకు తెలియనప్పుడు, అది మీకు లభ్యం కానప్పుడు, ఆత్మ అనుభవం నువ్వు పొందనప్పుడు, నువ్వు కళ్ళు మూసుకుని, బిగపెట్టుకుని ఇలా వచ్చి కూర్చొన్నప్పటికీ నీ మనసు లోకవిషయాలను చింతిస్తుంటే, నీ నిగ్రహం ఏమి చేస్తుంది? కిం కరిష్యతి. ఎక్కడ నీ మనస్సు ఉందో అక్కడకు తీసుకెళ్ళి నీ శరీరాన్ని పడేస్తుంది. అది ఒక్క పరమేశ్వరుడికి లొంగుతుంది కాని ఒక్క నీ ప్రయత్నం చాలదు. ఈశ్వరుడి దయ ఉండాలి. ప్రయత్నం చెయ్యవద్దు అనటం లేదు. అది ఒక్కటే చాలదు. ఆ ప్రయత్నంతో పాటు ఈశ్వరుడి దయ, ఈశ్వరుడి ప్రేమ, ఈశ్వరుడి అనుగ్రహం నీ నెత్తి మీద ఉండాలి అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. ఎవడు మాయని మాయం చేయగలడు? ఒక ఆత్మను దర్శించిన వాడే మాయని మాయం చేయగలడు కాని మనం మటుకు మాయని మాయం చేయలేము. పుస్తకాలు చదివితే పాండిత్యం వస్తుంది. గౌరవం వస్తుంది. కాని జ్ఞానం మటుకు రాదు. జ్ఞానం ఎవడికి వస్తుంది? ఆత్మను తెలుసుకున్న వాడికి జ్ఞానం వస్తుంది. ఆత్మను తెలుసుకోకుండా ఎవరైనా మోక్షం కోసం ప్రయత్నం చేస్తే అది అసాధ్యం. అది జరగనే జరగదు. అది అబద్ధం. ఆత్మను తెలుసుకోకుండా మటుకు ఎవడికి మోక్షం రాదు. మాయ విడిచి పెట్టదు. నా మనసు కుదురుగా ఉండటం లేదు. నా మనసుని ఒక చోట ఉండమంటే ఆగటం లేదు. అని ఇదే జనరల్‌గా complaints. ఇదే భగవాన్ చెప్పారు మీ మనసుని ఆగమంటున్నారు. మీ మనసు ఆగటం లేదు. నా మనసుని కదలమంటున్నాను అది కదలటం లేదు. ఎక్కడికి కదులుతుంది అది, ఉన్నది ఒక్కటే వస్తువు ఇంక ఎక్కడికి కదులుతుంది అది, ఆత్మను తెలుసుకో నువ్వు


ఆత్మవి అవ్వు. అప్పుడు నువ్వు స్వరాజ్యం పొందుతావు. అది నిజమైన స్వరాజ్యం. నా మనసు నా చేతిలో లేదు. నేను సుఖపడాలి అంటే సుఖపడలేక పోతున్నాను. నాకు శాంతి లేదు నాకు శాంతి లేదు అని నేను అంటున్నాను. ఇది స్వరాజ్యమా? స్వాతంత్ర్యమా? నిజంగా నాకే కనుక స్వరాజ్యం ఉంటే, నేనే కనుక ఆత్మను తెలుసుకుని ఉంటే, నేను శాంతిగా ఉండాలి, నా మనస్సును నిలబడమంటే నిలబడాలి. అది స్వరాజ్యం అంటే, రాగ ద్వేషాలకి, కామ క్రోధాలకి, పొగడ్తలకి, విమర్శలకి, లొంగిపోయి దుఃఖపడే నా మనస్సు స్వరాజ్యం పొందినట్టా? నేను ఆత్మను తెలుసుకున్నట్టా? నీకు సుఖపడాలి అని ఉంది కాని నువ్వు సుఖపడలేక పోతున్నావు. మరి ఏది నీ స్వరాజ్యం? నీకు శాంతి కావాలి అని నువ్వు కోరుకుంటున్నావు. కాని శాంతిని పొందలేకపోతున్నావు. ఇది స్వరాజ్యమా? మీకు స్వేచ్ఛ ఉందా? నీకు ఆవకాయ పడదు అనుకో ఆవకాయ మానేయ్ అని చెబుతుంటే నీ మనసు వింటుందా, పొట్ట బాధ పడుతుంది. పొట్ట బాధ పడినా కాని మనసు ఊరుకోవటం లేదు. డాక్టరు గారు నువ్వు ఆవకాయ మానేయ్ అని చెబుతున్నారు అయినప్పటికీ నీ మనస్సు ఆవకాయే తింటాను అంటుంది. నీ ఇంద్రియాలు నీ చేతిలో లేవు, నీ మనస్సు నీ చేతిలో లేదు. నువ్వు సుఖపడాలి అంటే సుఖపడలేక పోతున్నావు. ఇంక నువ్వు పొందే స్వరాజ్యం ఏమిటి? మీరు ఇంటికి వెళ్లి ప్రశాంతంగా ఆలోచించండి. మీ నెత్తిమీద మేము ఏమైనా బరువు పెడుతున్నామా? బరువు పెట్టటం లేదు. ఏమి చెబుతున్నాం? మిమ్మల్ని మీరు తెలుసుకోమని చెబుతున్నాం కాని, ఎదుటి వాడిని తెలుసుకోమని చెప్పటం లేదు. మీరెవరో మిమ్మల్ని తెలుసుకోమంటున్నాం. ఇందులో న్యాయం ఉందా? మీరు ఉన్నారా లేరా? మీరెవరో మిమ్మల్ని తెలుసుకోమంటున్నాం. ఇందులో మీకు ఏమైనా బరువు ఉందా? ఎటువంటి ప్రతికూల పరిస్థితులు వచ్చినప్పటికీ మీకు ఈశ్వరుడి మీద విశ్వాసం చలించకూడదు. ఈ పురాణాలు, ఈ ఉపన్యాసాలు, ఎవరు వింటారు? ఎవరికి కావాలి అని మీరు వీటిని కనుక అలక్ష్యం చేస్తే, ఈ భగవంతుడు చెప్పిన వాణిని మీరు వినకపోతే ఎప్పుడో రాబోయే జన్మలో మిమ్మల్ని తలుపు సందులో పెట్టి నొక్కి నొక్కి ఆయన మాట వినేలా చేస్తాడు, వాడు ఈశ్వరుడు. కొరడా పుచ్చుకుని తలుపు సందులో పెట్టి నొక్కి మిమ్మల్ని కష్టాల్లో పెట్టి పిండినప్పుడు కాని అయ్యో స్వామి ఇలా చెప్పాడు కదా ఆ రోజుల్లో నేను వినలేదు కదా అని ఆ బాధ మీకు అప్పుడు తెలుస్తుంది. ఇప్పుడు తెలియదు.

Shakespeare చెప్పాడు ఈ ప్రపంచంలో మూడు రకాలు అయిన మనుషులు పుడతారు.

మొదటి రకం ఎటువంటిది అంటే తల్లి కడుపులోనుండి బయటకి రావటమే మహాత్ములుగా పుడతారు, వాళ్ల చూపు, వాళ్ల మాట, వైభవంగా ఉంటుంది, విష్ణువు యొక్క చూపు కిందో, విష్ణువు యొక్క మాట కిందో, ఆ చేష్ట కిందో ఉంటుంది. తల్లి కడుపులోంచి బయటకు రాగానే వెలుతురు ఆ ముఖంలో ఉంటుంది, ఆ మాటలలో సంస్కారం అలా ఉంటుంది. వారు పుట్టుక తోటే మహాత్ములు, వాళ్లకు సాధన తోటి పని లేదు. ఇంక రెండో రకం మనుషులు ఉంటారు. వాళ్ళు పుట్టుక తోటి మహాత్ములుగా పుట్టరు. కానీ కొన్ని గొప్ప పనులు చేస్తారు. మంచి సత్కార్యాలు చేస్తారు. వాళ్ళు చేసిన పనులు చూసి వారు ఎంత మహాత్ములో, ఎన్ని గొప్ప పనులు చేస్తున్నారో అని మనం అనుకొంటాము. వీళ్ళు రెండో రకం మహాత్ములు. ఇక మూడో రకం మహాత్ములు ఎవరంటే, వాళ్ళు పుట్టుక తోటే గొప్పగా పుట్టరు. పుట్టి మంచి పనులు చేయరు, కాని మేము మంచి పనులు చేశాం అని మీరు అందరూ అనుకోవాలని మన పీక నొక్కుతూ ఉంటారు. ఆ మహాత్ముల తోటి లోకం అంతా నిండి ఉందని, Shakespeare ఒక డ్రామాలో చెప్పాడు. అంటే వాళ్ళు మనకు పెట్టకపోయినా పెట్టినట్టు చెప్పకోవాలి. వాళ్ళు గొప్పవాళ్లు కాకపోయినా మీరు చాలా గొప్ప వాళ్ళు అని సాంబ్రాణి పొగ వేస్తూ ఉండాలి. కొంతమంది వాళ్లని వాళ్ళే ఎంతో చక్కగా అలంకరించు కుంటారు. అద్దంలో చూసుకుని చాలా బాగున్నాం అని అలంకరించుకుంటారు, అది ఒక రకంగా అహంకారాన్ని అలంకరించుకోవడం లాంటిది. కొంతమంది వాళ్ళు అలంకరించు కోరు వాళ్ళు ఏమి తింటున్నారో ఏమి కట్టుకుంటున్నారో వాళ్లకి అక్కర్లేదు కానీ ఎదుటి వాళ్ళు ఏమైనా తింటున్నారా లేదా ఎదుటి వాళ్ల జీవితాలు ఎలా ఉన్నాయో అని నిరంతరం వాళ్ల గురించి ఆలోచించి, జీవించి, మరణిస్తారు. వాళ్ళు ఈశ్వరుణ్ణి అలంకరిస్తున్నారు. మీరు ఇప్పడు ఎవరిని అలంకరిస్తున్నారో ఇంటికి వెళ్లి ప్రశాంతంగా ఆలోచించుకోండి. మహాత్మా గాంధీ గారు ఒక సందర్భంలో ఒక మాట అన్నారు. ఓ భక్తులారా మీ అందరి అవసరాలు అవతల పెట్టండి, మీ అవసరాలు భగవంతుడు తీరుస్తాడు. కాని మీ ఆశ మటుకు భగవంతుడు తీర్చలేడు. మీరు ఆరోగ్యం కావాలి అని ప్రార్థించండి. అన్నం కావాలి అని ప్రార్థించండి అన్నం లేకపోతే, మీ అవసరం భగవంతుడు తీర్చగలడు. కాని మీ ఆశ మటుకు భగవంతుడు కూడా తీర్చలేడు అన్నారు. మీరు ఎక్కువ జ్ఞానం గురించి చెబుతున్నారు భక్తి గురించి ఎక్కువ చెప్పటం లేదు అని నా గురించి కొంతమంది అంటున్నారు, సరిగ్గా ఈ మాట అన్న మరుసటి రోజున పాలమూరు నుంచి ఒక అమ్మాయి వచ్చి నాన్నగారు మీరు నాకు జ్ఞానం గురించి చెప్పండి

భక్తి గురించి వినలేక పోతున్నాను అంది. అంటే భక్తి తక్కువని, జ్ఞానం ఎక్కువని కాదు ఆ అమ్మాయి సంస్కారం జ్ఞానం వైపు మొగ్గుతోంది. అంటే పూర్వ జన్మలో ఏ మార్గంలో అయితే మనం ప్రయాణం చేశామో, ఏ సంస్కారాన్ని అభివృద్ధి చేసుకున్నామో, ఏ ప్రవృత్తిని అభివృద్ధి చేసుకున్నామో, ఈ జన్మలో ఆ మార్గం మీదకే మన మనస్సు వెళుతూ ఉంటుంది. భక్తి మార్గమో, ధ్యాన మార్గమో, యోగ మార్గమో, కర్మ మార్గమో ఏదో ఒక మార్గం. పూర్వ జన్మలో ఏ మార్గంలో మనం సాధన చేశామో, ఆ మార్గం వైపుకే ఈ జన్మలో కూడా మన మనస్సు అటు వాలుతూ ఉంటుంది. భక్తి నీ కోరిక నెరవేరుస్తుంది. నీకు భక్తి ఉంటే నీ కోరికలు కూడా నెరవేరతాయి. కాదు అనటం లేదు, కాని అంత మాత్రం చేతే, అదే గమ్యం కాదు, అది ఒక మెట్టు మాత్రం, అది మేడ కాదు. నాలుగు మెట్టులు ఎక్కి ఇక్కడ కూర్చొన్నది మేడ అంటే కుదురుతుందా? కుదరదు. అయితే ఏది మేడ? ఏది అంతస్తు? నీ ఆత్మ అంతస్తు. ఈ లోపులో తాత్కాలికంగా నీ కోరికలు నెరవేరవచ్చు. మంచి పరిస్థితులు రావచ్చు ఇవన్నీ మెట్టులు మాత్రమే. సోపానాలు మాత్రమే. భగవంతుడు ఏమి చేస్తాడు అంటే ఒకొక్కసారి మీ కోరికలు నెరవేరుస్తాడు. ఎందుచేత? మీ కోరికలు నెరవేరిస్తే ఆయన మీద విశ్వాసం పెరుగుతుందని ఉద్దేశంతో కోరికలు నెరవేరుస్తాడు. అయితే ఇది మెట్టులే కాని మేడ కాదు అది. చాలా మంది నాకు మనశ్శాంతి లేదు అంటారు. ఎవరి తోటి చెప్పకండి, అసలు మనసులోనే శాంతి లేనప్పడు మనశ్శాంతి ఎక్కడ నుంచి వస్తుంది? శాంతి మనసులో లేదు, శాంతి దేవుడిలో ఉంది. శాంతి నిజంలో ఉంది. శాంతి ఆత్మలో ఉంది. దేవుడిని తెలుసుకున్న వాడికి శాంతి వస్తుంది. ఆత్మను తెలుసుకున్న వాడికి శాంతి వస్తుంది. అసలు మనసులోనే శాంతి లేనప్పడు మనశ్శాంతి ఎక్కడ నుంచి వస్తుంది? మీరు దేవుడికి ఏమి ఇస్తారు? అరటి పళ్ళు ఇస్తారా? అది కాదు మీకు ఎవరి మీద అయితే ద్వేషం వస్తుందో, ఆ ద్వేషం దేవుడికి ఇచ్చేయండి. ఎవరి మీద అయితే మీకు కోపం వస్తుందో ఆ కోపం దేవుడికి ఇచ్చేయండి. మోక్షం రాదేమో అని మీరు ఎవరు కంగారు పడకండి. దేవుడు దయామయుడు మీ అందరికి మోక్షం ఇస్తాడు. మీ ఇంటి పని మీరు ఎలా చేసుకుంటున్నారో ప్రపంచానికి సంబంధించిన పని దేవుడు అలా చేస్తాడు. ఎవరైతే సమాజం కోసం పని చేస్తున్నాడో వాడు దేవుడు. ఎవడి ఇంట్లో పని వాడు చేసుకుంటున్నాడు. మీ ఇంట్లో పని మీరు చేసుకుంటున్నారు వాడింట్లో పని వాడు చేసుకుంటున్నాడు. కాని సమాజంలో అందరి కోసం పని చేసేవాడు, వాడు దేవుడు. మీరు కూడా సమాజ క్షేమం కోరి సమాజం కోసం, ఏదైనా కొంత పని చేయగలిగితే మీకు కూడా

దేవుడు తన స్వరూపం ఇచ్చేస్తాడు.  ఎందుచేత అంటే ఆయన కూడా ఆ పనే చేస్తున్నాడు. అందుచేత మీ పని మీరు శ్రద్ధగా చేసుకోండి.  చక్కగా చేసుకోండి.  పని విడిచి పెట్టడానికి ప్రయత్నం చేయకండి.  నేను చేస్తున్నాను నేను చేస్తున్నాను అనే అహంభావనని విడిచి పెట్టండి కాని పనిని విడిచి పెట్టకండి.  నేను చేస్తున్నాను అనే భావన విడిచి పెట్టి మీరు పని చేస్తే, మీలో ఉన్న దుఃఖం అందరికి ఇప్పడే చల్లారిపోతుంది, ఇక్కడే చల్లారిపోతుంది.  ఈ అహంకారం వల్లే మనకు అశాంతి.  మీరు అందరూ జీవన్ముక్తులు అవ్వాలి.  మీరు అందరూ జ్ఞానులు అవ్వాలి.  ఎవరి దగ్గర ఉన్నప్పడు విపరీతమైన, మీ నోటి తోటి చెప్పటానికి వీలు లేనటువంటి, రాయటానికి వీలు లేనటువంటి, ఒక లోకాతీతమైనటువంటి, ఊహాతీతమైనటువంటి, అద్భుతమైనటువంటి, అపూర్వమైనటువంటి, ఉదాత్తమైనటువంటి, శాంతి వచ్చి మీ హృదయాన్ని ఆవరిస్తుందో వాడు జ్ఞాని.  మనసులో శాంతి లేదు.  మనసులో శాంతి లేనప్పడు మనసుకి శాంతి ఎక్కడ వస్తుంది?  ఎవడైతే మనసు యొక్క పరిధి దాటలేడో, ఎవడైతే మనసు అనే జైలులో ఉన్నాడో, వాడు తీవ్రమైన క్షోభకు గురి అవుతూ ఉండాల్సిందే.  నువ్వు మనసు నుండి శాంతి ఆశించకు.  మనసులో శాంతి లేదు, ఆత్మలో శాంతి ఉంది.  ఆత్మను తెలుసుకో, నువ్వు ఆత్మవి అవ్వు, నువ్వు శాంతి సామ్రాజ్యంలో స్వరాజ్యం పొందుతావు.  అది నిజమైన స్వరాజ్యం. నీకు సుఖపడాలి అని ఉంది కాని నువ్వు సుఖపడలేక పోతున్నావు.  నీకు శాంతి కావాలి అని నువ్వు కోరుకుంటున్నావు కాని శాంతిని పొందలేక పోతున్నావు.  ఏది స్వరాజ్యం?  మీరు ఇంటికి వెళ్లి ప్రశాంతంగా ఆలోచించండి.  మీకు ఇష్టం లేకపోతే నా మాటలను కాదు అనండి. నా మాటలను ఊసేయండి.  మీకు ఇష్టం లేకపోతే నా జీవితాన్ని కూడా మీరు కాదు అనవచ్చు. కాని ఆత్మ గురించి నేను చెప్పే ఈ మాటలు మటుకు దయ ఉంచి మీరు కాదు అనవద్దు. ఎందుచేత అంటే అది మీరే, మిమ్మల్ని మీరు కాదు అనకండి.  ఆత్మను విడిచిపెట్టి దేవుడు ఎక్కడో దూరాన లేడు.  మీ కోసం ఎదురు చూస్తున్నాడు ఈ బిడ్డలు ఎప్పడు వస్తారు అని,



**రమణమహర్షి, రామకృష్ణుడు చెప్పిన మాటలు నదులు, సముద్రాలు దాటి ఇతర దేశాలలో కూడా ప్రతి ధ్వనించాయి. దీనికి ఆ మాటలలో ఉన్న సత్యం, ఆ మాటలలో ఉన్న పవిత్రతే కారణం. మీ బుద్ధి పరిశుద్ధంగా ఉంటే, మీ హృదయం పవిత్రంగా ఉంటే అందులో నుండి వచ్చిన మాటకు మరణం ఉండదు. పవిత్రతలో నుండి, ఏకాగ్రతలో నుండి, ప్రవీణతలో నుండి వచ్చిన మాటకు శక్తి వస్తుంది.**

ఎప్పుడు ఈ బిడ్డలు మన వైపు ముఖం తిప్పుతారా మనం ఎప్పుడు ఆకర్షించుకుందాం అని, తల్లి బిడ్డల కోసం ఎదురు చూసినట్టు ఆత్మ మన కోసం ఎదురు చూస్తోంది. ముఖం అటు తిప్పటానికి మనం ఇష్టపడటం లేదు. ఆత్మ యొక్క వైభవాన్ని కాని, ఆత్మ యొక్క సామ్రాజ్యాన్ని కాని, ఆత్మ యొక్క ఉనికిని కాని, ఆత్మలో ఉన్న సుఖాన్ని కాని, శాంతిని కాని, సంతోషాన్ని కాని కాదు అనకండి. ఆత్మను కాదు అనకండి. ఎప్పుడూ ఉండేది అదే. నా దేహం నాది కాదు నన్ను విడిచి పెడుతుంది. నా తలంపులు నావి కావు నన్ను విడిచి పెడుతున్నాయి. కాని ఆత్మని విడిచి పెట్టి ఒక్క క్షణం కూడా నేను ఉండలేను. ఎందుచేత అంటే ఆత్మ నేనే. నన్ను విడిచి పెట్టి నేను ఎలా ఉండగలను. మీరు ఆత్మను కాదు అనకండి. మీకు ఎంత డబ్బు ఉన్న వల్లకాటి దగ్గరకు రాదు. పోనీ నన్ను కష్టపడి సంపాదించాడు వల్లకాటి దాకా సాగనంపుదాం అని డబ్బు అనుకోదు. మీ చదువులు, మీ డిగ్రీలు, మీ పట్టాలు, మీ గౌరవాలు కూడా వల్లకాటి దాకా రావు. వల్లకాటి దాకా ఎవరు వస్తారు? చుట్టాలు వస్తారు. మీ స్నేహితులు వస్తారు. తరువాత వాళ్లకి మనకి సంబంధం తెగిపోతుంది. సోదరమహాశయులారా మీరు ఎవరిని అయితే ప్రీతిగా చూస్తున్నారో వాళ్ళు వల్లకాటి దాకా వస్తారు నేను కాదు అనటం లేదు. కాని ఆత్మ నిరంతరం జన్మ జన్మకి మిమ్మల్ని విడిచి పెట్టకుండా మీ హృదయంలో ఉంటుంది, మీ కూడా వస్తుంది. మీ కూడా వచ్చేది ఆత్మ ఒక్కటే. అది హృదయంలో ఉంటుంది. మీ మరణాన్ని చూస్తూ ఉంటుంది. మీ మరణానంతర ప్రయాణంలో కూడా మీ కూడా ఉంటుంది. ఇరవై నాలుగు గంటలు జన్మ జన్మలకి విడిచి పెట్టకుండా, మీ కూడా ఉండేది మీ బంధువులు కాదు మీ స్నేహితులు కాదు, మీ పరిసరాలు కాదు, మీ కూడా ఉండేది నిరంతరం ఉండేది ఒక్క ఆత్మ ఒక్కటే. అటువంటి ఆత్మను మీరు ఉపేక్షిస్తారా? దానిని తెలుసుకోవడం కోసం ప్రయత్నం చెయ్యరా? స్మశానంలో మన దేహం కాలిపోయిన తరువాత కూడా మనలని విడిచి పెట్టకుండా మనలని అంటి పెట్టుకుని ఉండే ఆత్మను మీరు ఒక్కసారి స్మరించండి, ఆత్మను ధ్యానం చేయండి. దాని గురించి మీరు ధ్యానం చేయలేకపోతే, జపం చేయలేకపోతే, పూజ చేయలేకపోతే కనీసం వినడానికి కూడా మీకు చెవులు లేవా? మరణానంతరం మన కూడా వచ్చేది ఆత్మ ఒక్కటే. అది స్మశానంలో కాలదు. మన కూడా ప్రయాణం చేస్తూ ఉంటుంది. ఒక్క క్షణం కూడా అది మనలని విడిచి పెట్టదు. అటువంటి ఆత్మ గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? పోనీ విన్నారా దానిని తెలుసుకోవాలి అనే తపన మీరు ఎప్పుడైనా పడ్డారా? మీ కాలాన్ని కాని, మీ ధనాన్ని కాని, మీ దేహాన్ని కాని ఆత్మను తెలుసుకోవడానికి ఎప్పుడైనా వెచ్చించారా? వంట

కోసం భోగాల కోసం ఎంతో శ్రమ పడుతున్నాం కాని దేహం ఉంది కదా మనకి, ఆ దేహంతో ఎప్పుడైనా ఆత్మను తెలుసుకోవడానికి కొంచెం శ్రమ పడ్డారా? మీరు అందరూ సోమరిపోతులు అని నేను అనటం లేదు. మీరు అందరూ కష్టపడి పని చేసుకుంటున్నారు. అదంతా రైటే కాని ఆత్మను తెలుసుకోవడం కోసం ఎప్పుడైనా శ్రమ పడ్డారా మీరు? కాదు అనకండి, మీరు ఆలోచించండి. రాముడు జ్ఞాని, రమణమహర్షి జ్ఞాని, వశిష్టుడు జ్ఞాని, యేసు క్రీస్తు జ్ఞాని, కృష్ణుడు జ్ఞాని అని చెప్పుకుంటూ ఇళ్ళల్లో కూర్చొంటే మీకు ఏమి కలిసి వస్తుంది? ఎవడో జ్ఞాని అయితే మీకు కలిసి వచ్చేది ఏమిటి? కంచుమర్రులో ఎవరికో వంద ఎకరాల ఆస్తి ఉంటే మీకేంటి మీ పొట్ట కాలుతుంది. డబ్బు ఉన్న వాళ్లకి అజీర్తి బాధ, డబ్బు లేని వారికి ఆకలి బాధ, ఎవరికో జ్ఞానం వస్తే మీకు ఒరిగేది ఏమిటి మీరు బాగు పడటం చూసుకోండి. స్మశానం అనంతరం మీ బిడ్డలు, మీ భర్తలు, మీ మేనమామలు, మీ తండ్రులు, మీ చుట్టాలు వీళ్ళు ఎవరు మీతో రారు కదా, అయితే మీకు సంసారం తోటి సంబంధం తెగిపోయినట్టేనా అంటే తెగలేదు. సంసారం తోటి సంబంధం తెగదు. ఈ సంసారం నువ్వు చనిపోయిన తరువాత మీ కూడా వస్తుంది. ఏమిటి సంసారం? బయట ఉన్న మనుషులు సంసారం కాదు. మీ మనస్సే సంసారం, మీ మనస్సు మీ కూడా వస్తుంది. మళ్ళీ వచ్చే జన్మలో ఈ చుట్టాలు మారొచ్చు, మీ స్నేహితులు మారొచ్చు, మీ బట్టలు మారొచ్చు, మీ పరిసరాలు మారొచ్చు కాని మీ మనసు మిమ్మల్ని విడిచి పెట్టదు, మీ కూడానే వస్తుంది. సంసారం అంటే మీకు బయట ఉన్న మనుషులు కాదు. మీ మనస్సే సంసారం అది నిప్పు తోటి కాలదు. అందుచేత నువ్వు మరణించిన తరువాత నీ కూడా వస్తూనే ఉంటుంది. సంసారం నిన్ను విడిచి పెట్టదు. ఎక్కడ సంసారం లేదు? ఆత్మలో సంసారం లేదు అందుచేత నువ్వు ఆత్మను తెలుసుకునే వరకు సంసారం నిన్ను విడిచి పెట్టదు, నిన్ను తరుముతూనే ఉంటుంది. ఎంతకాలం అయితే నీకు సంసారం ఉందో, ఎంతకాలం అయితే నీకు ప్రారబ్ధ కర్మ ఉందో, అంతవరకు నీకు మోక్షం లేదు. నన్ను ఏ దారిన వెళ్ళమంటారు స్వామి అని భగవాన్‌ని అడిగితే వచ్చిన దారిన వెళ్లిపో అన్నారు. నువ్వు ఎక్కడ నుంచి వచ్చావు? ఆత్మ నుంచి వచ్చావు. ఆత్మ నుంచే నేను నేను అనే స్ఫురణ వస్తుంది. నీ తలకాయలో రావటం లేదు, నీ కాళ్లలో రావటం లేదు, నీ చేతుల్లో రావటం లేదు, నీ హృదయంలో నుండి వస్తుంది. ఆ స్ఫురణ పట్టుకుని ఆ నేను జాడ తెలుసుకుని దానికి యజమాని అయిన ఆత్మను తెలుసుకో, రమణమహర్షి అక్షరమణమాలలో అన్నారు కుక్క చేసే పని కూడా నువ్వు చేయలేవా? కుక్క తన యజమానికి దూరం అయిపోతే అడుగుల


యొక్క వాసనను పట్టుకుని కుక్కే యజమానిని చేరుకుంటుంది. ఈ నేను అనే తలంపు ఎక్కడ నుంచి వస్తుందో, ఆ వాసనను పట్టుకుని కుక్క చేసే పని కూడా నువ్వు చెయ్యలేవా? అందుచేత కుక్క యజమాని దగ్గరకు ఎలా వెళుతుందో, అలా ఈ నేను అనే తలంపుని పట్టుకుని దానికి యజమాని అయిన ఆత్మను చేరుకో. దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడికి నేను అనే స్ఫురణ ఉంది. దేవుడు లేడు అని చెప్పేవాడికి నేను అనే స్ఫురణ ఉంది. ఈ నేను నేను అనే స్ఫురణ లేని వారు ఇక్కడ ఎవరు అయినా ఉన్నారా? ఇక్కడే కాదు ఈ విశాల ప్రపంచంలో ఎవరైనా ఉన్నారా? నువ్వు దేవుడు ఉన్నాడు అని చెప్ప దేవుడు లేడు అని చెప్ప ఇవన్నీ చంటి పిల్లల మాటలు. రమణమహర్షి నీతోటి వాదించటానికి రాలేదు. నీకు సందేశం ఇవ్వటానికి, నిన్ను అనుగ్రహించడానికి, నిన్ను కరుణించడానికి, నిన్ను ఆత్మసామ్రాజ్యానికి అధిపతిని చేయటానికి రమణమహర్షి ఈ భూమి మీదకు వచ్చాడు కాని నీతోటి వాదించటానికి ఇక్కడకు రాలేదు. వాదన కోసం రోదన కోసం ఇక్కడకు రాలేదు. భోదించటానికి వచ్చాడు. ఎందుచేత? ఆయన అనుగ్రహం చూడండి. సంపన్నురాలు ఏమి అంటోంది నాకు కావలసింది మనశ్శాంతి, ఎలా ప్రయత్నం చేస్తే ఆ శాంతి వస్తుందో నాకు తెలియటం లేదు. కరుణించి నాకు ఆ మార్గం చూపండి. నాకు దారి చూపించండి. నాకు గమ్యానికి వెళ్ళాలి అని ఉంది. ఆ destination చేరుకోవాలి అని ఉంది. కాని దారి తెలియటం లేదు నాకు దారి చూపించు స్వామి అంటే అప్పుడు భగవాన్ అంటున్నారు. నీకు మార్గం కనిపిస్తుంది. నువ్వు శరణాగతి పొందు. ఈశ్వరుడిని శరణు వేడుకో, నీకు తప్పనిసరిగా మార్గం కనిపిస్తుంది. కొంతమందికి భక్తి ఉంటుంది కాని దేవుడి మీద కొంచెం నెపాలు చెబుతూ ఉంటారు. దేవుడు మాకు ఏమి ఉపకారం చేయటం లేదు అంటారు. చాలాకాలం నుంచి భక్తిగా ఉంటున్నాం సత్యనారాయణ వ్రతం చేశాం, ఆ వ్రతం చేశాం, ఈ వ్రతం చేశాం, దేవుడు మా వంక ఏమి చూడటం లేదు, మమ్మల్ని పట్టించుకోవటం లేదు అంటారు. అది శరణాగతా? దేవుడు లేడు అని నీ మనస్సు ఎదురు తిరుగుతుంటే, అది శరణాగతా? శరణాగతి అంటే మీకు ఉదాహరణ చెబుతాను రామచంద్రమూర్తి అరణ్యవాసంలో లక్ష్మణ, మనం ఏదో పది రోజులు ఇక్కడ ఉండాలి కదా, పర్ణశాల ఒకటి నిర్మించు అని రామచంద్రమూర్తి చెప్పారు. అప్పుడు లక్ష్మణ స్వామి అన్నాడు, ఎక్కడ నిర్మించమంటారు? ఇది మీరు జాగ్రత్తగా వినండి. శరణాగతి అంటే ఇదే, ఎక్కడ నిర్మించమంటారు ఈ కుటీరం అని అడిగాడు. నీకు ఎక్కడ బాగుంది అని తోస్తే అక్కడ నిర్మించమన్నాడు రామచంద్రమూర్తి. అప్పుడు లక్ష్మణుడు అయ్యా ఆ పని నేను చేయను

అన్నాడు. మీరు చెప్పిన పని చేస్తాను. మీరు కుటీరం ఫలానా చోటున నిర్మించమంటే నేను నిర్మిస్తాను కాని, ఆ ప్లేస్ మీరు చెబితేనే నిర్మిస్తాను కాని, నాకు ఇష్టం వచ్చిన చోట మాత్రం నేను నిర్మించను అది నా పని కాదు అన్నాడు, అది శరణాగతి. నువ్వు శరణాగతి పొందు అంటున్నారు భగవాన్. సోదరమహాశయులారా! మీ సంకల్పం అంటే మీకు ఇష్టమా? భగవంతుడి సంకల్పం అంటే మీకు ఇష్టమా? మీ శరీరం అంటే మీకు ఇష్టం, మీ మనసు అంటే మీకు ఇష్టం, మీ ఇంద్రియాలు అంటే మీకు ఇష్టం, మీ సంకల్పాన్ని మరచిపోయి భగవంతుని సంకల్పాన్ని మీరు ప్రేమించగలరా? ఎవరైతే తన సంకల్పాన్ని విడిచి పెట్టుకుని భగవంతుడి సంకల్పాన్ని గౌరవిస్తున్నాడో, ఎవడైతే భగవంతుడి సంకల్పానికి ఒదిగి ఉంటున్నాడో, అణిగి ఉంటున్నాడో వాడే శరణాగతి పొందగలడు. మీకు ఇష్టం ఉన్నా మీకు ఇష్టం లేకపోయినా భగవంతుడి సంకల్పం నెరవేరుతుంది. నువ్వు అనుకోవచ్చు అనుకునేది నీ సంకల్పం, నీ సంకల్పానికి శక్తి లేదు. భగవంతుడి సంకల్పానికి శక్తి ఉంది. అందుచేత భగవంతుడి సంకల్పం నెరవేరుతుంది. భగవంతుడు నాకు అన్యాయం చేశాడు అంటే అది శరణాగతా? కొంతమంది భక్తిగా ఉంటారు కానీ మళ్ళీ ఈ మాటలు మధ్య మధ్య వదిలేస్తూ ఉంటారు. భగవంతుడు మాకు చాలా అన్యాయం చేసేశాడు ఎంతో ఘోరం చేసేశాడు. అంటే భగవంతుడికి మీరు అంటే ఇష్టం లేదా? భగవంతుని సంకల్పాన్ని మీరు గౌరవించలేరా? ఎవడైతే నిజమైన శరణాగతి పొందాడో వాడికి దుఃఖమే లేదు. మనకి దుఃఖం వస్తోంది అంటే లోపల శరణాగతి లేదు అని అర్థం. ఒకళ్ళను అడగక్కరలేదు. డబ్బు లేకపోవడం వల్ల ఎక్కువ కష్టాలు వచ్చేస్తున్నాయి అని చాలామంది అనుకుంటున్నారు. డబ్బు లేకపోవడం వల్ల మనిషికి ఎక్కువ దుఃఖం రావటం లేదు, భయం వల్ల ఎక్కువ దుఃఖం వస్తుంది.

మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, మీరు మటుకు శాంతిగా ఉండాలి, సుఖంగా ఉండాలి, నువ్వు గనుక శరణాగతి కనుక పొందితే శాంతి దొరుకుతుంది. శరణాగతిలో శాంతి ఉంది. మీకు ఆనందం కలుగుతుంది. నాకు భక్తి ఉంటే నాకు శాంతి వచ్చేస్తుంది అని మీరు చెబుతున్నారు. నాకు భక్తి ఉండాలి కదా అసలు, భక్తి వచ్చే యోగ్యత నాకు ఉందా? ఆ భక్తి వచ్చే అర్హత నాకు ఉందా? ఆ భక్తి పొందే అదృష్టం నాకు ఉందా? అని ఈ అమ్మగారు అడుగుతున్నారు. ఎవరు? ఈ సంపన్నురాలు. అప్పుడు భగవాన్ అంటున్నారు. మీరు ఎవరైనా భక్తులు కావచ్చు, దీనికి స్త్రీలు అని, పురుషులు అని, రాజులు అని, బ్రాహ్మణులు అని, వైశ్యులు అని, హరిజనులు అని

తేడా లేదు. ఎవరైనా సరే భక్తులు అవ్వచ్చు. ఆధ్యాత్మిక సామాగ్రి అందరికి ఉంది. ఎవరైతే భగవంతుడిని ప్రార్థిస్తున్నారో, వాళ్ళందరికి భక్తి కలుగుతుంది. ఇది ఒక్కరి సొత్తు కాదు, ఇద్దరి సొత్తు కాదు, అందరూ జ్ఞానాన్ని పొందవచ్చు, అందరూ మోక్షాన్ని పొందవచ్చు. ఇది అందరి సొత్తు. నువ్వు ప్రయత్నం చేస్తే చాలు. అందుచేత రాదు అని నువ్వు అనుకోవద్దు. నీకు తప్పనిసరిగా వస్తుంది. ఇది ఎవరో ఒకరి సొత్తు కాదు ఈ జ్ఞానం అనేది, ఇది అందరికి వస్తుంది కాని నువ్వు చేయవలసింది అల్లా కాస్త ప్రయత్నం. సూర్యుడు ఆకాశంలో ప్రకాశిస్తున్నాడు. ఆ సూర్యుడిని మనం కనిపెట్టనక్కర్లేదు. మన మొఖం అటు తిప్పితే చాలు కనిపిస్తాడు. అలాగే ఈశ్వరుడు నీ హృదయంలో ఉన్నాడు. నువ్వు ప్రయత్నం చేసి నీ మొఖం అటు తిప్పితే చాలు. నీ హృదయంలో ఉన్నటువంటి ఆ జ్ఞాన సూర్యుడు ఎప్పుడైతే నీకు తెలిసాడో, ఈ రాత్రికి పగలుకి నీకు బేధం పోతుంది. ఇది రాత్రి అని, ఇది పగలు అని, ఈ బేధం దాటి వెళ్ళిపోతారు మీరు, ఎప్పుడు? జ్ఞాన సూర్యుడిని మీరు గ్రహించినప్పుడు, ఒక విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. జ్ఞానం కోసం కనుక మీరు నిజంగా ప్రయత్నం చేస్తుంటే, ముందు మీ ఇంట్లో వాళ్ళు అందరూ మీకు విరోధులు అవ్వచ్చు. అప్పుడు మీకు భయం వేస్తుంది. అలా భయం వేసి వెనక్కి వెళ్ళిపోతే పతనం అయిపోతారు. మీ ఇంట్లో ఎవరికో కోపం వచ్చిందని నువ్వు ఆత్మ ప్రయత్నం వదిలేస్తే, ఊరిలో ఎవరికో కోపం వచ్చిందని ఆత్మ ప్రయత్నం వదిలేస్తే మీరు పతనమవుతారు. భయస్తులకి, బలహీనులకి, సోమరితనం ఉన్న వాళ్ళకు ఆత్మ తెలియదు. ఆత్మ కోసం ఏదైనా త్యాగం చేయటానికి మీరు సిద్ధంగా ఉన్నప్పుడే మీకు ఆత్మ తెలుస్తుంది. దానికోసం అవసరం అయితే నువ్వు ఊరిని విడిచిపెట్టు, నీ దేశాన్ని విడిచి పెట్టు, ప్రపంచాన్ని విడిచి పెట్టు, ఎవడైతే త్యాగో వాడికి మటుకే ఆత్మ తెలుస్తుంది కాని భోగికి మటుకు ఆత్మ తెలియదు. అవసరం అయితే ఆత్మ కోసం ఎవడైతే లోకాన్ని అంతా త్యాగం చేయగలడో వాడికి మాత్రమే ఆత్మ తెలుస్తుంది కాని కబుర్ల వల్ల, కాకరకాయల వల్ల తెలిసేది కాదు. పులిని చూసి సింహాన్ని చూసి భయం వేస్తే ఫరవాలేదు కానీ కోడి పిల్లను చూస్తే కొంతమందికి భయం, గాలి కొంచెం పెద్దగా వేస్తే భయం, కోడి

**మీరు గురువు అనుగ్రహము గురించి చెపుతారు. ప్రేమ గురించి ఎప్పుడూ మాట్లాడరేమిటి అని భగవాన్‌ని అడిగారు. అనుగ్రహం ప్రేమ లేకుండా ఉంటుందా అన్నారు భగవాన్.**



పిల్లలను చూసి భయపడే మనకా ఆత్మ తెలిసేది అన్నారు స్వామీ వివేకానంద. అంటే త్యాగం చేయలేని వాడికి ఆత్మ తెలియదు. జ్ఞానికి దేహం ఉన్నా దేహం లేనట్టే. ఎందుచేత దేహం లేనట్టు అంటే వాడికి దేహం నేను అనే భావన పోయింది. జ్ఞానికి దేహం ఉన్నట్లు మన కళ్లకు కనబడుతోంది కానీ వాడికి మటుకు దేహం లేనట్టే, వాడికి శరీరం ఉన్నప్పుడు కూడా అశరీరుడే. ఎందుచేత? నేను దేహాన్ని అనే భావన ఎప్పుడైతే నశించి పోయిందో, అప్పుడు ఈ శరీరం ఉన్నా శరీరం లేనట్టే. మృత్యువు యొక్క నీడ కూడా వాడి శిరస్సు మీద పడదు. భగవాన్ శరీరం ఇంకా కొన్ని రోజులు తప్పించి ఉండదు అని భక్తులు అనుకున్నప్పుడు ఒక భక్తుడు "మీరు పోయిన తరువాత మాతోటి ఎవరు మాట్లాడతారు, మమ్మల్ని ఎవరు ప్రేమిస్తారు?" అని ఎవరో భగవాన్‌ని అడిగితే, "ఇప్పుడు మిమ్మల్ని ప్రేమించేది ఈ దేహమా? మిమ్మల్ని ప్రేమించేది ఏదో ఈ దేహం పడిపోయిన తరువాత కూడా ఉంటుంది. ఈ దేహమా మిమ్మల్ని ప్రేమించేది? మిమ్మల్ని ప్రేమించేది ఇప్పుడు ఉంది, దేహం పడిపోయిన తరువాత ఉంటుంది. అందుచేత మిమ్మల్ని ప్రేమించే వస్తువు ఇప్పుడు ఉంది, అప్పుడు ఉంటుంది. ఆనాడు ఉంది, ఈనాడు ఉంది, ముందు నాటికి కూడా ఉంటుంది" అన్నారు భగవాన్. జ్ఞాని అంటే ఎవరు? దేహం కాదు, ఆత్మ. అది దేహం పడిపోయిన తరువాత కూడా ఉంటుంది. అది ప్రేమిస్తూనే ఉంటుంది. అది అనుగ్రహిస్తూనే ఉంటుంది. మీరు మోక్షాన్ని పొందే వరకు మిమ్మల్ని వెంటాడుతుంది. ఎప్పటి వరకు? మీ స్వరూపం మీరు పొందే వరకు. దేవుడికి రూపం లేదు. కాని మన కోసం, రూపాలు తొడుగుతూ ఉంటాడు. మనం చొక్కాలు తొడుక్కున్నట్టే దేవుడు రూపాలు తొడుగుతూ ఉంటాడు. ఎందుచేత? మనం ఈ రూపాన్ని విడిచి పెట్టలేక పోతున్నాం అని, ఈ రూపం నువ్వు కాదు నువ్వు ఆత్మవి అని చెప్పటం కోసం ఆ రూపం తొడుక్కుని మనకోసం వస్తున్నాడు. ఆయన రూపంలో ఉన్నప్పుడు కూడా ఆ రూపం ఆయనది కాదు అని ఆయనకు తెలుసు. వాడు దేవుడు. మనకు దశరథ కుమారుడు రాముడు అంటే ఇష్టం ఉండదు సినిమా రాముడు అంటే ఇష్టం. అంటే వేషాలు అంటే మనకి ఇష్టం. మనకు నిజం అంటే ఇష్టం ఉండదు. సినిమా రాముడు వస్తున్నాడు అనుకోండి అందరం వెళ్లిపోతాం చూడటానికి, కాని హృదయ రాముడిని చూడటానికి మనం ప్రయత్నం చేయం, ఎందుచేత? అది అబద్ధం, ఇది నిజం. నిజం దగ్గరకు మనం వెళ్లలేము. సినిమా రాముడిని చూడటానికి అవసరం అయితే నువ్వు మద్రాసు వెళుతున్నావు. హృదయ రాముడిని చూడటానికి నువ్వు వెళ్లవు. ఒక్క

రూపాయి కూడా ఖర్చు పెట్టవు. ఇదే మాయ. మాయ నిజం దగ్గరకు వెళ్ళనివ్వదు, ఎప్పుడైతే నువ్వు నిజాన్ని పొందావో అప్పుడు మాయ చీల్చుకుని బయటకు వచ్చేస్తుంది. సంపన్నురాలు అంటోంది నేను చిన్న దానిని గృహస్థ ఆశ్రమంలో ఉన్నాను. గృహిణిగా నిర్వర్తించవలసిన ధర్మాలు ఎన్నో ఉంటాయి. ఎటుచూసినా బంధువులు అని, స్నేహితులు అని, వంట అని, వార్పు అని, నీతి అని, అవినీతి అని ఇంకోటి అని, ఇంకోటి అని, ఎన్నో గొడవలు ఉన్నాయి. ఇన్ని గొడవల మధ్య ఈ సంసారం మధ్య నాకు భక్తి కుదురుతుందా? అని అడుగుతోంది. అప్పుడు భగవాన్ ఏమి అన్నారు అంటే నిస్సందేహంగా మీరు ఎవరు? ముందు బాణాలు విడిచి పెట్టారు, ముందు భక్తి అన్నారు, తరువాత ఇంకోటి అన్నారు అప్పుడు పెద్ద బాణం పాశుపతాస్త్రం తీసి విడిచి పెడుతున్నారు. నిస్సందేహంగా నువ్వు ఎవరవు? ఇన్ని ధర్మాలు చెబుతున్నావు, కుటుంబం గురించి చెబుతున్నావు, నువ్వు ఎవరవు? నేను నేను అని చెబుతున్నావు చుశావు ఆ నేను ఎవరు? నువ్వు ధర్మం గురించి చెబుతున్నావు, ధర్మం గురించి చెప్పే నువ్వు ఎవరు? నువ్వు గృహస్థ ఆశ్రమంలో ఉన్నాను అని చెబుతున్నావు. ఆ గృహస్థ ఆశ్రమంలో ఉన్న నువ్వు ఎవరు? నువ్వు దేహానివి కావు శుద్ధ చైతన్యానివి. నువ్వు ఆత్మవు, దేహం జడం. ఈ దేహాన్ని ఊరికే మనం తొడుక్కున్నాం ఈ దేహమే నేను అనుకోండి వల్లకాటికి ఎవడూ వెళ్ళడు. దేహమే నేను అనుకోండి. మనిషి చనిపోయిన తరువాత కూడా దేహం ఉంది. అప్పుడు దేహం అడుగుతుంది. ఏమని? నన్ను ఎందుకు వల్లకాటికి తీసుకువెళుతున్నారు? ఇంట్లోంచి కదలను అని అంటుంది. దేహం నువ్వు కాదు కాబట్టి దానిని కాల్చేస్తుంటే ఊరుకుంటున్నావు. ఈ దేహం ఎవరిది అంటే చెప్పటానికి అందరూ మొహమాట పడుతున్నారు. ఈ దేహం ఎవరిది? నాదే. అయితే ఈ దేహం నాది అని చెప్పేవాడు ఎవడు? వాడిని ఎప్పుడైనా మీరు చూశారా? దేహం నాది దేహం నాది అని చెప్పేవాడు ఎవడు? ప్రాణాలు పోయేటప్పుడు ఏడ్చేవాడు ఎవడు? ఈ దేహం నాది అని చెప్పేవాడే ప్రాణం పోయేటప్పుడు ఏడుస్తాడు. వాడి ఉనికి ఎప్పుడైనా మీరు తెలుసుకున్నారా? అహంకారానికి దేహం కావాలి, ఆత్మకి దేహం అక్కర్లేదు. ఈ దేహాన్ని మీరు ఏమైనా అనండి, ఎంత కోపం వస్తుందో, ఎవరైనా నల్లగా ఉన్న వాళ్ళను మీరు నల్లగా ఉన్నారు అనండి వాళ్లకి ఎంత కోపం వస్తుందో చూడండి. ఈ మధ్య ఒక అమ్మగారు అన్నారు ఆవిడకు అరవై ఏళ్ళు ఉన్నాయి. నా మామగారి మీద ఇప్పటికి నాకు కోపం పోలేదు అన్నారు. మీ మామగారు ఇప్పుడు ఉన్నారా అని అడిగాను, చనిపోయారు అంది, మరి ఏమిటండి ఇంకా కోపం

మీకు ఎవరి మీద అని అడిగితే పెళ్లి అప్పుడు ఆయన మా కోడలు నలుపు, మా కోడలు నలుపు అంటూ ఉండేవారు. ఈవిడ గుండెల్లో ఆ కోపం ఉండిపోయింది. ఆయన చనిపోయినా కూడా ఆయన మీద కోపం పోలేదు. దేహబుద్ధి ఇది. దేహబుద్ధి ఎవడిని విడిచిపెట్టదు. ఎంత ప్రయత్నం చేసినా ఎంత సాధన చేసినా ఎన్ని పూజలు చేసినా యజ్ఞాలు, తపాలు ఎన్ని చెప్పినప్పటికీ, ఈ దేహబుద్ధి మిమ్మల్ని చుట్టేస్తూ ఉంటుంది. నిన్ను విడిచి పెట్టదు. జన్మ జన్మలకి తరుముతుంది. ఏ దేహం వచ్చినప్పుడు ఆ దేహమే నాది అనుకుంటుంది. ఈ దేహబుద్ధి నిన్ను అల్లుకుంటూ ఉంటుంది. నిన్ను విడిచి పెట్టదు. ఎవరిని అనుగ్రహిస్తాడో పరమేశ్వరుడు వాడిని విడిచి పెట్టేస్తుంది కాని మిమ్మల్ని కాని, నన్ను కాని విడిచి పెట్టదు. ఒకసారి భగవాన్ అన్నారు ఎవరికి అయితే ఈశ్వర అనుగ్రహం ఉందో, వారికి ఈ దేహబుద్ధి పోతుంది అని చెప్పారు. అప్పుడు ఒకరికి కోపం వచ్చింది. ఎవడికి అయితే ఈశ్వరఅనుగ్రహం ఉందో వాడికి దేహబుద్ధి పోతే మరి మా తపాలు ఏమిటి? మా జపాలు ఏమిటి? మా ప్రయత్నాలు ఏమిటి? మేము పడే కష్టాలు ఏమిటి? మా కష్టానికి ఫలితం లేదా? మా ప్రయత్నానికి ఫలితం లేదా? ఇలా అన్యాయంగా మాట్లాడకండి అని అతను తీవ్రమైన ఆవేశంతో మాట్లాడుతున్నాడు. అప్పుడు భగవాన్ సముదాయించి నువ్వు చేసిన ప్రయత్నం వల్లే ఈశ్వర అనుగ్రహం నీకు వస్తుంది. నువ్వు కష్ట పడుతున్నావు కాబట్టి నీ కష్టాన్ని చూసి ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు. నీ కష్టానికి ఫలితం లేదు అని నేను చెప్పటం లేదు. ఈశ్వర అనుగ్రహం వల్ల నీకు జ్ఞానం వస్తుంది అని చెబుతున్నాను. ఆయనకి ఏమి అక్కర్లేదు మీ కష్టానికి ఫలితాన్ని మీకు ఇచ్చేస్తాడు అని భగవాన్ అతడిని సముదాయించారు. నువ్వు ఎవరవు?దేహానివి కావు, నువ్వు శుద్ధ చైతన్యానివి. సినిమా తెర మీద దృశ్యాలు వస్తాయి, అనేకమంది దెబ్బలాడుకుంటారు. అసలు ఎప్పుడైనా సినిమా చూశావా? ఆ తెరమీద బొమ్మలు వస్తాయి, వెళ్లి పోతూ ఉంటాయి. అవన్నీ దృశ్యాలు మటుకే. తెరమీద నిప్పు ఉంటుంది కాని ఆ నిప్పు తెరని కాల్చదు, తెరమీద నీళ్ళు ఉంటాయి ఆ నీళ్ళు మటుకు తెరని తడి చేయలేవు. నీ జన్మలు కాని, నీ దుఃఖం కాని, నీ మరణం కాని, నీ వేదన కాని, నీ ధర్మం కాని ఇవేమీ నువ్వు కాదు. నువ్వు అనుకుంటున్నావు. తెర మీద ఉన్న నిప్పు తెరని ఏ విధంగా అయితే కాల్చదో అదేవిధంగా నీ కష్టాలు, నీ జన్మలు, నీ నష్టాలు, నీ లాభాలు, ఇవి ఏమి కూడా ఆత్మను ముట్టుకోవు. అయితే వాటిని చూసి నువ్వు చలించి పోతున్నావు. ఎందుకు నువ్వు చలించి పోతున్నావు? దేహం నువ్వు అనుకుంటున్నావు.

మనసు నువ్వు అనుకుంటున్నావు. ఆ బొమ్మలు నిజం అనుకునేవారు ఏ విధంగా అయితే ఉద్రేకపడతారో అదే విధంగా ఈ దేహాలు, ఈ రాగ ద్వేషాలు, ఈ కామ క్రోధాలు, ఈ ధర్మాలు, ఈ అధర్మాలు నిజం అనుకునేవారు కూడా దుఃఖానికి గురి అవుతున్నారు. నువ్వు ఆత్మగా ఉంటే నీకు సంశయాలు ఏమి లేవు, నువ్వు ఆత్మగా ఉండలేకపోతున్నావు. నువ్వు ఆత్మగా ఉండు, శాంతిగా ఉండు, నువ్వు ఆత్మగా ఉండగలిగితే ఏది నిన్ను అంటదు. నువ్వు ఆత్మగా ఉండగలిగితే నీకు జ్ఞానం రాకుండా ఆపుచేసేది ఈ సృష్టిలో ఏదీ లేదు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**

**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥**

నువ్వు అన్ని ధర్మాలను, అధర్మాలను అన్నింటిని విడిచిపెట్టు. నన్ను ఒక్కడినే శరణు వేడుకో. అప్పుడు నీలో ఉన్న అన్ని పాపాల నుండి, అని దోషాల నుండి నిన్ను విముక్తుడిని చేసి నీకు మోక్షాన్ని ఇస్తాను అని భగవంతుడు వాసుదేవస్వామి చెపుతున్నాడు. అందుచేత నువ్వేమి బెంగ పెట్టుకోకు, నువ్వేమి దుఃఖ పడకు, నువ్వేమి ఆవేదన పడకు, నువ్వు కన్నీళ్లు కార్చకు. అయ్యో నేను మోక్షాన్ని పొందగలనా, నేను ఆ పరమస్థితిని పొందగలనా, ఆ చివరిస్థితిని పొందగలనా, ఆ అనుభవాన్ని పొందగలనా, ఆ అనుభూతి నేను పొందగలనా అని దుఃఖ పడకు అర్జునా, అది నేను నీకు ఇస్తాను నువ్వు ఎందుకు అలా బాధపడతావు. నువ్వు నన్ను శరణు వేడుకో, నన్ను లక్ష్యంగా పెట్టుకో, నీ హృదయంలో నాకు స్థానం ఇస్తే, నీ బుద్ధిలో ఉన్న దోషాలు అన్నీ కూడా తీసేసి నీ హృదయంలో ఉన్న నేను నీకు వ్యక్తం అవుతాను. అది చివరిస్థితి అప్పుడు నీకు దుఃఖం చల్లారిపోతుంది. అప్పుడు ఇంక నీకు దేహం లేదు నీకు జన్మ లేదు అని పరమాత్మ చెపుతున్నాడు.



**గురువు అనుగ్రహంలో పడిన వారికి బాహ్య పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా, అవి వారిని బాధించవు. వాడి మనస్సు కాలిపోయిన తాడులాగ అవుతుంది. మనస్సు సూక్ష్మాతి సూక్ష్మం అయ్యి లోచూపు కలుగుతుంది. ఎప్పుడైతే హృదయం యొక్క లోయల లోనికి ప్రవేశించాడో సత్యవస్తువు దాని స్వరూపాన్ని ఇచ్చేస్తుంది.**

# సద్గురువు

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)**

కర్మానుసారంగా శరీరాలు ధరించటం విడిచిపెట్టటం, ఇది ఒక చక్రం. ఈ చక్రం నుండి విడుదల పొందాలంటే గురువు ద్వారా తప్పించి ఇంకో మార్గం లేదు అని సద్గురువు శ్రీ నాన్న గారు మనకి బోధిస్తూ, ఆచార్యులు వారు సద్గురువు గురించి చెప్పిన నిర్వచనం వివరించారు -సద్వస్తువు సమీపంలోకి తీసుకెళ్ళి నిన్ను కూర్చోపెట్టేవాడే సద్గురువు. బోధ అవసరమే, కాని కేవలం బోధ సరిపోదు. మనందరిపై తన అనుగ్రహం ప్రేమ ఎల్లప్పుడూ వర్షిస్తూ ఉన్న మన సద్గురువు శ్రీ నాన్నగారు, గురువు యొక్క విశిష్టతని మనకి చాలా సార్లు చెప్పారు. ఈ గురుపూర్ణిమ సందర్భంగా, సద్గురువు గురించి శ్రీనాన్నగారు చెప్పిన కొన్ని విషయాలు....

**గురువే మన ఐశ్వర్యం**

గురువుని గౌరవించాలి, గురువుని ప్రేమించాలి. గురువు యందు భక్తి, శ్రద్ధ, విశ్వాసం కలిగి ఉంటే, అందరు దేవతలని మనం గౌరవించినట్లు. గురువు చేసే పనిని తల్లితండ్రులు చేయలేరు. తల్లితండ్రులు మీకు నాలుగు బట్టలు కొని ఇస్తారు, లేకపోతే తిరగటానికి కారు ఒకటి కొని ఇస్తారు, ఏదో మామూలుగా భౌతికమైనవి ఇస్తారు కాని జ్ఞానం ఎక్కడ ఇస్తారు మీకు? వాళ్ళు మిమ్మల్ని దుఃఖంలోనుండి బయటికి తీసుకురాలేరు. ఇంక పునర్జన్మ లోనుండి ఎలా విడుదల చేయగలరు! మీరు భౌతికంగా బాగుపడుతున్నారో లేదో చూసుకుంటారు కాని, మీలో ఏదైనా కల్మషం ఉంటే, ఆ కల్మషం తీయటానికి తల్లితండ్రులు ప్రయత్నం చేయరు. అంటే తల్లితండ్రులు చెడ్డవారు అని కాదు, వారి దృష్టి అంతవరకే ఉంటుంది. గురువు అలా కాదు. ఏ కారణాల వలన మీరు ఈ జన్మలోకి వచ్చారో, ఆ కారణాలు అన్నీ ఇక్కడే కాల్చేసి పునర్జన్మ లేనిస్థితికి తీసుకువెళ్ళటానికి గురువు చూస్తాడు.

మీకు ఏదైనా దుఃఖం వస్తోంది అనుకోండి, అది ఈశ్వరనిర్ణయం. కొంతమంది గురువులకి ఆ దుఃఖాన్ని తప్పించే శక్తి ఉంటుంది. అయితే ఈశ్వరుడికి తెలియకుండా వాళ్ళకి దుఃఖం రావటం లేదు అని గురువుకి తెలుసు. ఇప్పుడు వాళ్ళకి దుఃఖం తగ్గిస్తే, ఆ సంఘటనని మార్చేస్తే, వచ్చే జన్మలో అయినా వాళ్ళు అనుభవించటం తప్పదు. అసలు ధరించకుండా ఆపు చెయ్యలేము. ఈ పని వల్ల వాళ్ళకి ఇంకో శరీరం వస్తుంది, ఇప్పడే

అనుభవిస్తే పోతుంది. ఈశ్వరసంకల్పాన్ని మనం అడ్డుకోవటం వల్ల మళ్ళీ జన్మలు పెంచిన వాళ్ళం అవుతాము, అని మౌనంగా ఉంటాడు గురువు. మీరు దుఃఖపడితే వాళ్ళు కూడా దుఃఖపడతారు కాని గబుక్కున కలగచేసుకోరు. ఈశ్వరసంకల్పాన్ని అడ్డుకోవటం వలన మళ్ళీ జన్మలు పెరుగుతాయి, ఆ వచ్చే నష్టం ఏమిటో మీకు తెలియదు, గురువుకి తెలుసు. గురువుకి ఇవన్నీ తెలిసి, క్వయట్ గా ఉండి మీ దుఃఖంలో భాగం పంచుకుంటాడు కాని, తొందరగా ఈశ్వరసంకల్పం తోటి ఇంటర్‌ఫియర్ అవ్వడు.

ఎవరైనా రమణమహర్షిగారితో ఇటువంటి విషయాలు డిస్కస్ చేస్తే, ఆయన కొండ శిఖరం చూపించి, మరి ఆయన నిర్ణయం అలా ఉంది అనేవారు. వాళ్ళ దుఃఖంలో భాగం పంచుకునేవాడు కానీ మార్పు చేస్తే మళ్ళీ ఆ దుఃఖం అనుభవించటానికి మనం శరీరం కల్పించిన వాళ్ళం అవుతాము అని ఊరక ఉండేవారు. ఎందుచేతనంటే జరగబోయే విషయం వాళ్లకి తెలుస్తా ఉంటుంది. ఈశ్వరుడు చట్టం ప్రకారం మీ దేహాన్ని నడుపుతాడు అంతే, కాని గురువు అలా కాదు. ఆ డెస్టినీ ప్రకారం మీకు రావలసిన కష్టాలు వస్తున్నప్పటికీ, ఆ ప్రారబ్ధం యొక్క ప్రభావం మీ మైండ్ మీద పడకుండా మిమ్మల్ని శాంతిగా, హ్యాపీగా ఉంచేవాడు గురువు. అవసరమైతే మీ ప్రారబ్ధాన్ని తీసుకునేవాడు గురువు.

**గురువుతో అనుబంధం**

గురువు ఎప్పడూ మీతోటే ఉన్నాడు, మీతోనే నడుస్తున్నాడు. మీ శరీరం చనిపోవటం తోటి, ఆ శరీరానికి ఉన్న సంబంధాలు అన్నీ తెగిపోతాయి. శరీరంలో గాలి బయటికి వెళ్లిపోయిన వెంటనే, శరీర గతమైన బంధువులు, స్నేహితులు, ఆస్తులు, బ్యాంకు అకౌంటులు, అన్నిటితోటి సంబంధాలు తెగిపోతాయి. మీకు భౌతికమైన సంబంధాలు అన్నీ తెగిపోతాయి, కాని గురువుతోటి సంబంధం తెగదు. ఎందుచేతనంటే గురువు అంతర్యామిగా ఉంటాడు. ఆయన నీ దేహంలో ఒక భాగం కాదు కాబట్టి, నీ దేహం కాలినప్పడు వాడు కాలిపోడు. నువ్వు కోటి జన్మలు ఎత్తినా నీ కూడా ఉండేవాడు గురువు మాత్రమే.

గురువు నీ లోపల ఉండటమే కాదు, నిన్ను చూస్తూ ఉంటాడు. నీకు మెచ్యూరిటీ వస్తోందో లేదో చూస్తూ ఉంటాడు. రాంగ్ డైరెక్షనులో ఉన్న మనుషులని రైట్ డైరెక్షనులో పెట్టటానికి ఏదో ఒక తలుపు సందున పెట్టి నొక్కాలి, నొక్కితేనే కాని లోపల ఉన్న కల్మషం కక్కరు. ఎక్కడ రైట్ డైరెక్షను తీసుకురావాలి, ఎక్కడ టర్నింగ్ తీసుకురావాలి అని గురువు

ప్రతి జన్మలో మీకు అంతర్యామిగా ఉండి, ఆ టైము కోసం చూసి, ఏ టైములో ఏ పని చేయాలో, ఏ టైములో మీకు మెచ్యూరిటీ ఇవ్వాలో, అవన్నీ చూస్తూ మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాడు, మీకు భౌతికమైన సంబంధాలు అన్నీ తెగిపోతాయి కాని గురువుతో సంబంధం కొనసాగుతుంది. గురువు ఏ స్టేట్‌లో ఉన్నాడో, ఆ స్టేట్ నువ్వు పొందేవరకూ, గురువుతోటి వన్ నెస్ (oneness) సాధించేవరకూ నీ కూడా ఉంటాడు, నిన్ను విడిచిపెట్టడు. ఒక జన్మ కాదు, రెండు జన్మలు కాదు, వంద జన్మలు కాదు, గురువు పొందిన స్థాయి నువ్వు పొందేవరకూ ఆయన నిన్ను వెంటాడుతూనే ఉంటాడు. వేటగాడు జంతువుని ఎలా వెంటాడతాడో అలా ప్రతి జన్మలో కూడా నిన్ను వెంటాడుతూ ఉంటాడు. వాడే నిజమైన గురువు.

## గురువు అంతర్యామి

నువ్వు లోపల ఉన్న ట్రూత్‌ని (సద్వస్తువుని) రియలైజ్ చేసాక, ఈ సద్వస్తువే కదా ఇంతకాలం నుండి నాకు తెలియకుండా ఒక శరీరంతో నన్ను వెంటాడుతోంది అని అప్పుడు నీకు తెలుస్తుంది. అవుట్ అఫ్ గ్రేస్, అవుట్ అఫ్ కంపాషన్, ఆ సద్వస్తువే దానికి రూపం లేకపోయినా, నీ కోసం రూపం ధరించి నిన్ను వెంటాడుతోందని నీకు ఎప్పుడు తెలుస్తుంది అంటే, ట్రూత్ ని రియలైజ్ చేసాక నీకు తెలుస్తుంది. ఇప్పడు ట్రూత్ వేరు గురువు వేరు అనుకొంటున్నావు. ట్రూత్ తెలిసాక తెలుస్తుంది, నువ్వు అనుకొనే గురువు ఈ ట్రూతే ఒక్కటే అని అప్పటి వరకూ నీకు తెలియదు.

మీరు తొందర పడకండి. ఎప్పడు ఏది అవసరమో, ఎక్కడ ఏది అవసరమో, మీరు మరిచిపోయినా, మీ గురించి గురువు మరిచిపోడు. మీకు మైండ్ ఉంది కాబట్టి మీకు మరుపు వస్తుంది. గురువు మరిచిపోయే సమస్య లేదు. గురువు అంతర్యామి, నీ లోపల ఉన్నాడు, బయటా ఉన్నాడు, కింద ఉన్నాడు, పైన ఉన్నాడు. అంతటా ఉన్నాడు. వాడు ఎప్పడు ఏ పని చెయ్యాలి, ఎక్కడ ఏ పని చెయ్యాలి, అది నువ్వు మరిచిపోయినా, సరిగ్గా ఆ క్షణం వచ్చేసరికి, అక్కడ గురువు చేయవలసిన డ్యూటీ ఉంటే, ఒక్కసారి నీకు ఆ టైము చూసి లిఫ్ట్ ఇస్తూ ఉంటాడు, ఆధ్యాత్మిక పురోగతి కలుగజేస్తాడు.

మామూలుగా మీకు భక్తి మాటలు చెప్పడు, సరదాగా మాట్లాడుతూ ఉంటాడు. మీరు బాగున్నారా, పిల్లలు బాగున్నారా, భోజనం చేసావా, పంటలు ఎలా ఉన్నాయి మీ పెద్దబ్బాయికి పెళ్లి కుదిర్చారా, ఇలా అడుగుతూ ఉంటాడు. గురువుకి మీ పెద్దబ్బాయి పెళ్ళికి

సంబంధం ఏమిటి! ఇలా మిమ్మల్ని మాయమాటలలో పెట్టేసి, సడన్ గా మీకు తెలియకుండా మీ మనస్సుని లోయలోకి గెంటేస్తాడు, మత్తు ఇచ్చేటప్పుడు డాక్టరు, ఒకటి రెండు మూడు నాలుగు ఇలా అంకెలు లెక్కపెట్టమంటాడు. మనం అనటం మానేసాక, మనకి మత్తెక్కినట్టు గుర్తు. ఎరుకలో ఉంటే ఆ పెయిన్ భరించలేవు కాబట్టి, నిన్ను మాయలో పెట్టి, నువ్వు పరాకుగా ఉన్నప్పుడు నిన్ను హృదయగుహలోకి గెంటేస్తాడు. మాట్లాడేది మాయ మాటలు - హౌ ఆర్ యు అంటాడు, నీకు పొలం ఎంత ఉంది అంటాడు. నీకు చేపల చెరువులు ఉన్నాయా, వరిచేలు ఉన్నాయా అని అడుగుతాడు. చేపల చెరువుల గొడవ ఆయనకి ఎందుకు! ఇలా ఏదో ఒకటి అడుగుతాడు, ఇలా ఏదో మాట్లాడుతూ, మీకూడా నడుస్తూ, ఎప్పుడో సడన్‌గా నిన్ను లోపలకు నొక్కేస్తాడు. ఎక్కడైతే ట్రూత్ ఉందో, అక్కడికి మనస్సుని సడన్‌గా లోపలికి ఆ ట్రూత్‌లోకి గుంజేస్తాడు. ఆయన బయట నుంచి రానక్కరలేదు. నీ లోపలే ఉన్నాడు కదా. గురువు చేసే సహాయం కాని, గురువు దగ్గరి నుంచి వచ్చే అనుగ్రహం కాని, మనం మాటలతోటి వర్ణించలేము. గురువు అత్యంత ప్రేమ కలిగి ఉంటాడు. ఆయనది లౌకికమైన ప్రేమ కాదు, అది అలౌకికమైనది. పులి నోటిలో పడ్డ మాంసపు ముక్క బయటకు రాదు, అలాగే గురువు అనుగ్రహంలో పడిన వాడు రక్షింపబడితీరతాడు, వాడు మోక్షం పొందుతాడు అందులో నుండి బయటకు వచ్చే సమస్యే లేదు.

## అభ్యాసం చేయాలనే బుద్ధి కూడా గురువు అనుగ్రహమే

"నేను కృతార్థుడిని అవ్వాలంటే, గురువు యొక్క అనుగ్రహం అవసరం అని చెపుతున్నారు కదా, నేను ఇప్పుడు ఎంతో కొంత ప్రయత్నం మొదలుపెట్టాను" అని ఒక భక్తుడు భగవాన్‌తో అంటే "నువ్వు ప్రయత్నం చేస్తాను, అభ్యాసం చేస్తాను అంటున్నావు. అసలు ప్రాక్టీసు చెయ్యాలనే తలంపు కూడా గురువు అనుగ్రహం లేకుండా నీకు రాదు. సత్యాన్ని తెలుసుకోవాలి అనే తలంపు నీకు వస్తోంది అంటే, అది నీ తెలివితేటల వల్ల వస్తోందా? నేను అభ్యాసం చేస్తున్నాను అని నువ్వు అంటున్నావు కదా. అభ్యాసం చేస్తున్నాను అనే బుద్ధి నీకు కలగటం కూడా గురువు అనుగ్రహమే. అది నీ సొంతం కాదు. నువ్వు అసలు లేవు! నేను మొదలుపెడతాను, ఏదో చేస్తాను అంటున్నావు కదా, ఆ చేసేవాడు ఎవడూ లేడు. ఆ మొదలు పెట్టేవాడు దొంగ నేను. అసలు వాడు లేడు కదా! ఈ దొంగ నేనుకి నేను అభ్యాసం చేయాలనే బుద్ధి వస్తుందా? నీకు అభ్యాసం చేయాలనే బుద్ధి కూడా గురువు కృప వల్లే కాని దొంగ నేనుకి కాదు" అన్నారు భగవాన్.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# నిజమైన పుట్టుక

'భగవాన్ శ్రీరమణమహర్షి' భక్తులు ముఖ్యముగా గుర్తుపెట్టుకోవలసిన రోజు జూలై 16. భగవాన్ శ్రీరమణమహర్షి అప్పటి వేంకటరామన్ తన 17వ ఏట అనగా ది॥ 16-07-1896న మధురైలో తన పినతండ్రి గారి ఇంట్లో మేడమీద గదిలో మరణానుభవాన్ని పొంది అమృతుడయ్యాడు. అప్పుడు దేహము శవముగా మారినప్పటికీ, దేహముతో ఇసుమంతయు సంబంధము లేని సద్వస్తువు (బ్రహ్మము) తానుగా, నేనుగా స్ఫురించింది. దేహముతో సంబంధము తెగిపోయినప్పటికీ, తన ఉనికికి అణుమాత్రము లోటు కనిపించలేదు. 'నేను' నిరంతరంగా, అఖండముగా ఉన్నాను అనే స్ఫురణ ఆయనకు స్పష్టముగా ఉంది. దేహము జడము కాబట్టి, తాను ఉన్నాను అన్న సంగతి దేహానికి తెలియదు, అట్టి జడమైన దేహమును స్మశానంలో కాల్చి బూడిద చేసినప్పటికీ తాను దేహము కాదు కాబట్టి తనకు నాశము లేదని తాను అమృతుడనని, అదే నేనుకు నిజమైన అర్థం అని తెలుసుకున్నారు. అది ఆయనకు ప్రత్యక్షానుభవం, ఊహకు సంబంధించినది కాదు. మరణానుభవం ద్వారా వేంకటరామన్ నిజమైన పునర్జన్మనెత్తారు. అహంకారం నశించి బ్రహ్మమైనారు. ఉపనిషత్తులలో చెప్పబడిన బ్రహ్మము అంటే ఏమిటో తెలుసుకోవాలన్న కాంక్ష లేకుండానే ఆయనకు మరణానుభవం ద్వారా అంతర దృష్టి కలిగి మనోమూలంలో ఉన్న అధిష్టాన చైతన్యం తానుగా, నేనుగా, అనుభవైకవేద్యం అయింది. మృత్యు స్పర్శలేని తాను శరీరానికి అభిన్నమని స్పష్టముగా తెలుసుకున్నాడు. సకలమునకు ఆధారముగా ఉన్న చైతన్యమే దేహేంద్రియ మనోబుద్ధులకు ఆధారముగా ఉండి, వాటికి అతీతముగా, సూక్ష్మంగా తన స్వరూపంగా ఉందని అది మరణము చేత స్పృశింపబడదని అదే నేను అని, అదే ఆత్మయని, అదొక్కటే సత్యమని తెలుసుకున్నాడు. అట్టి అమృతానుభవం వల్ల కల్పిత సృష్టిజాలము నుండి బయటపడినాడు. ఇరవై నిమిషముల తరువాత మరల శ్రీ రమణస్వామికి శ్వాస, రక్త ప్రసారము ప్రారంభమైనవి. భగవాన్ శ్రీరమణమహర్షి కారణజన్ముడు కాబట్టి పరమాత్మే స్వయంగా మృత్యువు రూపంలో వచ్చి ఆయనను జ్ఞాన సింహాసనం మీద అధిష్టింపజేసాడు. ఇట్టి అమృతానుభవాన్ని సద్గురు శ్రీనాన్నగారు తరచు భక్తుల వద్ద ప్రస్తావించేవారు. మన దేహేంద్రియ మనోబుద్ధులు, త్రికరణాలు, సమాజసేవ, మన జీవిత విధానము మున్నగునవన్నీ అమృతానుభవం పొందడానికి మనకు సహకరించేవిగా తీర్చిదిద్దాలి. ఎవరైతే ఈ మానవ జన్మను సద్వినియోగం చేసుకుని మరల పుట్టకుండా చేసుకుంటారో, వారిదే నిజమైన పుట్టుక. తిరిగి పుట్టకుండా చేసుకోవడమే ఈ పుట్టుక యొక్క సార్థకత.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# స్వాధీనమైన మనస్సు - మోక్షానికి కారణమౌతుంది

మనస్సు నుండి విముక్తి పొందినప్పుడు - గతం ఉండమన్నా ఉండదు. అంటే "గతం" ఖతం. అప్పుడు మనం ప్రస్తుతంలో ఉంటాము. కాని మనస్సుకు మన మాట వినే మంచితనం లేదు. మనకు కావలసిన సత్య విషయాన్ని యోచిస్తూ ఉంటే ఏవిధంగాను ఉపయోగపడక మరోపనికిమాలిన విషయాలపై పోయి అక్కడ కూర్చుంటుంది. దానికి మనం ఇలా చెప్పాలి. "ఏ విషయం నాకు అక్కరలేదు దేన్నీ చింతించకు" అంటే ససేమిరా అంటూ ఒప్పుకోదు. చేతకాని పనికిమాలిన విషయాలు చెబుతున్నావే అని మనకే బుద్ధిచెబుతుంది. అన్ని సమయాల్లోనూ విపరీతమైన ఆలోచనలతో ఊరేగుతుంది. కారణం వేల జన్మల వాసనల బలంముందు మన సాధనాబలం తక్కువ. శ్రీనాన్నగారు "రెండు గొఱ్ఱె పొట్టేళ్ళు దెబ్బలాడుకుంటూ ఉంటే బలమైనది అవతలదాన్ని గెంటుకొని తమురుతుంది. మన సాధనాబలం తక్కువ అయితే మన గతి అంతే" అన్నారు. ఆ మనస్సు ఎలా ఉంటుంది అంటే పిచ్చివాడు ఎప్పుడూ ఏదో గొణుక్కుంటూ ఉంటాడు. వాసన మనలను అలాచేసి తన ఆట తాను ఆడుతుంది. స్వాధీనమైన మనస్సు వేరుగా విధేయంగా మనం ఏడవకుంటే ఏడ్చి, నవ్వమంటే నవ్వే సేవాతత్త్వం దానికి ఉంటుంది. అలా తర్ఫీదు చేయటాన్ని మనోనిరోధం అంటారు. అప్పుడు అది మన ఆజ్ఞకు ఎదురు చూస్తూ ఉంటుంది. జె.కె. "అవసరమైనప్పుడు నా మనస్సును వాడుకొంటాను" అన్నారు అంటే తనకు అనుగుణంగా నడచుకొంటుంది అని. సాధకునికి ఈశ్వరదర్శనం కంటే మనోనిగ్రహం గొప్పదని భావించాలి. అప్పుడు ఈశ్వరదర్శనంతో నిలకడగా ఆనందిస్తూ కూర్చుంటుంది. అప్పుడు మనకు సాధ్యం కానిదంటూ ఉండదు అంటారు అనుభవజ్ఞులు. మనం అస్వతంత్ర మనస్కులం అవ్వటంచేతనే మనం ఇంత బలహీనులమై ఏ కార్యంలో దక్షత లేకుండా ఉన్నాము. మనస్సు మదపుటేనుగు గురు అనుగ్రహమే దానికి అంకుశంలా పొడిచి అది మచ్చిక అయి మనకు అన్ని పనులు చేసి మన ఆజ్ఞకోసం ఎదురుచూస్తుంది. మనస్సును జయించిన మహావీరులు కనుకనే విశ్వామిత్ర - ఆంజనేయులు మహాకార్యాలను అవలీలగా చేసారు. మనోజయమే యోగము. దీనికి సూత్రం మనం ఇతరులకు తాపాన్ని సంతాపాన్ని కలిగించకుండా వారికి క్షేమదాయకంగా హితంగా, శాంతంగా మనం వ్యవహరించాలి. "సత్యం భూత హితం ప్రియ" అన్నారు. త్రికరణశుద్ధి కావాలి. కామకారణం, క్రోధకారణం హృదయంలో ఉండి వాగ్రూపంతో బహిర్గతమైనది సత్యంకాదు. ఇతరులను అగౌరవపరచకూడదు. సత్యవ్రతుని వాక్కు వట్టిపోదు ఏది చేసినా ఫలించి తీరుతుంది. మనకు డబ్బు మీద ఆశలేదు అని జాగ్రదవస్థలో అనుకోవచ్చు ఆ మాటే స్వప్నంలో అనగలిగితే కాంచన విజయం కలిగినట్లే అదే దానికి గీటురాయి. స్వప్నాన్ని అందుకే కల్పించాడు ఈశ్వరుడు మన మనో రోగాలు తెలపటానికే. మనం దైవీ సంపదతో జీవించాలి. గడచిన కాలం రాదు వర్తమానాన్ని సాధనకోసం పరిరక్షించుకొంటే మనస్సు స్వాధీనమౌతుంది. సత్యం ఎరుకపడుతుంది. నిరంతరం గురు ప్రార్థనలో ఉంటే అదే మోక్షకారణమౌతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**